بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR**
Qadian

సంపుటి: 11 | సంచిక: 36

www.akhbarbadr.in

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

### తమ మనస్సుతో యుద్ధము చేయుము.

یٰۤاَیُّہَا الَّذِیۡنَ اٰمَنُوۡا ہَلۡ اَدُلُّکُمۡ عَلٰی تِجَارَۃٍ تُنۡجِیۡکُمۡ مِّنۡ عَذَابٍ اَلِیۡمٍ ۔ تُؤۡمِنُوۡنَ بِاللّٰہِ وَ رَسُوۡلِہٖ وَ تُجَاہِدُوۡنَ فِیۡ سَبِیۡلِ اللّٰہِ بِاَمۡوَالِکُمۡ وَ اَنۡفُسِکُمۡ ؕ ذٰلِکُمۡ خَیۡرٌ لَّکُمۡ اِنۡ کُنۡتُمۡ تَعۡلَمُوۡنَ (الصّف:12،11)

అనువాదం: “ ఓ విశ్వాసులారా! మిమ్ములను ఒక బాధకరమైన శిక్ష నుండి ముక్తి నిచ్చు వ్యాపారమును గూర్చి మీకు నేను తెలుపుదునా?. మీరు అల్లాహ్‌ను, అతని ప్రవక్తను విశ్వసింతురు. అల్లాహ్ మార్గమునందు తమ ఆస్తిపాస్తులు, తమ ప్రాణములతో యుద్ధము చేయుదురు. మీరు గుర్తెరిగినచో ఇది మీకు చాలా ఉత్తమమైనది. (అస్సఫ్: 11-12)

తేది: 03 సెప్టెంబర్ 2026 క్రీ, శ. 03 తబూఖ్ 1405 హి, శ. 20 రబీఉల్ అవ్వల్ 1448 హి,ఖ.



ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

## తమ మనస్సుతో పోరాటం చేయువాడు కూడ వీరుడే.

فَضَالَۃَ بْنَ عُبَیْدٍ یُحَدِّثُ، عَنْ رَسُوْلِ اللّٰہِ صَلَّی اللّٰہُ عَلَیْہِ وَسَلَّمَ أَنَّہٗ قَالَ: " کُلُّ مَیِّتٍ یُخْتَمُ عَلٰی عَمَلِہٖ إِلَّا الَّذِیْ مَاتَ مُرَابِطًا فِیْ سَبِیْلِ اللّٰہِ، فَإِنَّہٗ یُنْمٰی لَہٗ عَمَلُہٗ إِلٰی یَوْمِ الْقِیَامَۃِ، وَیَأْمَنُ مِنْ فِتْنَۃِ الْقَبْرِ "، وَسَمِعْتُ رَسُوْلَ اللّٰہِ صَلَّی اللّٰہُ عَلَیْہِ وَسَلَّمَ یَقُوْلُ: " اَلْمُجَاہِدُ مَنْ جَاہَدَ نَفْسَہٗ ۔ [سنن ترمذی/ کتاب فضائل الجہاد عن رسول اللہ صلی اللہ علیہ وسلم/حدیث: 1621]

అనువాదం: హజ్రత్ ఫజాలా బిన్ ఉబైద్ రజియల్లాహ్ అన్‌హు ఇలా ఉల్లేఖిస్తున్నారు: ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: ప్రతి మృతుడి కార్యకలాపాల పరంపర ముసివేయబడుతుంది. కాని దైవ మార్గంలో సరిహద్దులను కాపాడుతూ వీరమరణం పొందిన వ్యక్తి పరంపర కొనసాగుతూనే ఉంటుంది. అతని కార్యకలాపాలు ప్రళయదినము వరకు హెచ్చించబడుతూనే ఉంటాయి. అతడు సమాధి యొక్క విపత్తుల నుండి కూడ సురక్షితముగా ఉంటాడు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విషయాన్ని కూడ “అనగా తమ మనస్సుతో పోరాడు వాడు కూడ వీరుడే అని” తెల్పుచుండగా నేను విన్నాను.

عَنِ النَّبِیِّ صَلَّی اللّٰہُ عَلَیْہِ وَسَلَّمَ أَنَّہٗ رَجَعَ مِنْ بَعْضِ غَزَوَاتِہٖ فَقَالَ رَجَعْنَا مِنَ الْجِہَادِ الْأَصْغَرِ إِلَی الْجِہَادِ الْاَکْبَرِ قِیْلَ یَا رَسُوْلَ اللّٰہِ ہِیَ مَا الْجِہَادُ الْاَکْبَرُ قَالَ وَہِیَ مُجَاہِدَۃُ النَّفْسِ۔

(رد المختار علی الدر المختار ج۳ ص۲۳۵)

అనువాదం: ఒకసారి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక యుద్ధం నుండి తిరిగి వస్తూ ఇలా పలికారు: మనం చిన్న జిహాద్ నుండి నుండి పెద్ద జిహాద్ వైపుకు తిరిగి వస్తున్నాము. అందుకు ఓ రసూలుల్లాహ్! ఆ పెద్ద జిహాద్ ఏమిటి? అని అడిగారు. అందుకు ప్రవక్త (స) అది మనస్సుతో చేయు పోరాటం అని సమాధానం ఇచ్చారు.



## పవిత్రమైన మనస్సు కొరకు మనోవాంచలతో తప్పక పోరడవలెను.

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ ( మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని) అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు:**

“ వినయపు స్థితి, విశ్వాసం కొరకు విత్తనం వంటిది. ఆ తరువాత వ్యర్థమైన మాటలను విడిచిపెట్టడం ద్వారా విశ్వాసం తన సున్నితమైన పచ్చని మొలకను వెలువరించుతుంది. తరువాత తన సంపదలో నుండి జకాత్ ఇవ్వడం ద్వారా విశ్వాసమనే వృక్షానికి కొమ్మలు ఏర్పడతాయి. అవి దానిని కొంతవరకు బల పరుస్తాయి. ఆ తరువాత మనస్సు యొక్క కోరికలను ఎదుర్కోవడం ద్వారా ఆ కొమ్మల్లో చాలా బలం మరియు ధృఢత్వం ఏర్పడుతుంది. తరువాత తన ఒడంబడికలను మరియు న్యాసములను అన్ని విధాలుగా కాపాడటం ద్వారా విశ్వాసపు వృక్షం తన బలమైన కాండంపై స్థిరంగా నిలబడుతుంది. ఆ తరువాత ఫలాలను ఇచ్చే సమయం వచ్చినప్పుడు, దానికి మరొక శక్తి ప్రసాదించబడుతుంది. ఎందుకంటే ఆ శక్తి ప్రసాదించబడే వరకు వృక్షానికి పువ్వులు గానీ, ఫలాలు గానీ ఏర్పడలేవు.”

**(జమీమా బరాహీన్-ఎ-అహ్మదీయా, భాగం 5, రూహానీ ఖజాయిన్, సంపుటి 21, పుట 209, ఫుట్‌నోట్)**

“అల్లాహ్ తఆలా ఈ జమాఅత్‌ను స్థాపించాలని సంకల్పించినప్పుడు, ఆయన ఉద్దేశం “ప్రపంచం నుండి కనుమరుగైపోయిన నిజమైన మారిఫత్ (దైవజ్ఞానం)ను, అలాగే ఈ కాలంలో కనిపించకుండా పోయిన నిజమైన తక్వా (దైవభీతి) మరియు పవిత్రతను తిరిగి స్థాపించాలి.” అని ఉండెను.

**(మల్ఫూజాత్, సంపుటి 4, పుటలు 213-214, నూతన సంచిక)**

## “ మనస్సును పవిత్రం చేసుకోవడం అనేది మానవుడి శక్తికి మించిన కార్యం ”

**హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్, ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ అన్‌హు ఇలా పేర్కొన్నారు:**

“మనస్సును పవిత్రం చేసుకోవడం (తజ్కియా-ఎ-నుఫూస్) అనేది మానవుడి శక్తికి మించిన కార్యమని ప్రతి వ్యక్తి కూడా అర్థం చేసుకోగలడు. నిజానికి తల్లిదండ్రుల కంటే ఎక్కువగా తమ పిల్లలను ఎవరు ప్రేమించగలరు? అయినప్పటికీ వారు కూడా తమ పిల్లల మనస్సులను శుద్ధి చేయలేరు.

ఆత్మశుద్ధిలో రెండు విషయాలు అవసరం. మొదటిది: పాపాలను విడిచిపెట్టడం. రెండవది: ఆధ్యాత్మికతలో అభివృద్ధి చెందడం. పాపాలను విడిచిపెట్టడం గురించి ఇలా వివరించ బడింది: మేము మీకు ఈ బోధనను ఇస్తున్నాము. ప్రతి వస్తువూ అల్లాహ్ తాలాకే చెందినది. ఆకాశం, భూమి మరియు విశ్వంలోని ప్రతి అణువు అల్లాహ్ తాలా ఆధీనంలోనే ఉంది. కాబట్టి ఆయన అనుమతించిన దానినే మీరు స్వీకరించండి; ఆయన నిషేధించిన దాని నుండి దూరంగా ఉండండి. ఎందుకంటే యజమాని అనుమతి లేకుండా ఏ వస్తువునైనా ఉపయోగించే వ్యక్తి శిక్షకు అర్హుడవుతాడు.

రెండవ అంశం ఆధ్యాత్మికతలో అభివృద్ధి చెందడం. దాని కోసం ఇలా చెప్పబడింది: సమస్తం మాది; మరియు ప్రతి రకమైన మేలు, శ్రేయస్సు మా ద్వారా మాత్రమే లభించ గలదు. కాబట్టి మీరు మా ఆజ్ఞలను విధేయతతో పాటించి నప్పుడు, మేము మిమ్మల్ని మా క్షమాపణ అనే కొంగులోకి చేర్చుకుంటాము. మా సామర్థ్యవంతమైన ప్రభావం (తసర్రుఫ్) మిమ్మల్ని మా సాన్నిత్యానికి చేర్చుతుంది.”

**(తఫ్సీర్-ఎ-కబీర్, సంపుటి 3, పేజీ 531, యు.కే ప్రచురణ)**

**(అహ్మదియ్యా వార్తలు)**

**సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యద హుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ తాలా కృపతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన, దీర్ఘాయుష్షను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుగాకా!, దేవదూతలతో సహాయ, సహకారములు అందించుగాకా! (ఆమీన్).**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రొపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

لَا اِلٰہَ اِلَّا اللّٰہُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰہِ

**సంపాదకీయం:**

# ప్రియమైన దేశానికి... శాంతి సందేశం అవసరం!

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మనం ఎదురయ్యే ప్రతి క్లిష్టతరమైన పరిస్థితుల వైపు అడుగులు వేస్తున్న కొద్దీ, గతంతో పోలిస్తే మనకు జాతియ్య ఐక్యతభావం ఇంకా ఎక్కువగా అవసరమవుతోందని పరిస్థితులు మరియు సంఘటనలు తెలియజేస్తున్నాయి. భారతదేశం వివిధ మతాలు, కులాలు, జాతులు మరియు వర్ణాలతో కూడిన ఒక అందమైన పుష్పగుచ్ఛం వంటిది. అందులో ఐక్యత, సౌభ్రాతృత్వం అనే పుష్పాలను ఎంచుకుంటే, వాటి సువాసన మన హృదయాలను, మనస్సులను పరిమళింపజేస్తుంది. కానీ ఈ వైవిధ్యాన్ని విభేదాలు, విచ్ఛిన్నత వైపు మళ్లిస్తే, నాలుగు దిక్కులా దుర్వాసన వ్యాపిస్తుంది. కేవలం దుర్వాసనే కాదు, మనము రోజురోజుకూ అనుభవిస్తున్న బాధాకరమైన దుర్వాసన కూడ వ్యాపిస్తుంది.

తమస్వార్థ ప్రయోజనాల కోసం మతాన్ని దుర్వినియోగం చేయడం, జాతులు మరియు కులాల మధ్య విభజనను సృష్టించే నీచమైన ఆటలు భారతదేశాన్ని ఒక ప్రమాదకరమైన అగాధం వైపు నెట్టివేస్తోంది. సామాజిక మాధ్యమాలను పరిశీలిస్తే, రోజురోజుకూ ఐక్యత, పరస్పర సామర్యతను గురించి మాట్లాడే వారి సంఖ్య తగ్గిపోతున్నట్లు తెలుస్తోంది. ప్రతి వర్గం, ప్రతి మతంలోనూ విద్వేషాన్ని వ్యాప్తి చేసే మాటలు మాట్లాడేవారి సంఖ్య పెరుగుతోంది. అయితే ఒక విషయం చాలా స్పష్టంగా ఉంది. అదేమిటనగా, విద్వేషం, విభేదాలు, ఘర్షణల వల్ల కేవలం ఒక జాతికే నష్టం కలగదు, అన్ని వర్గాల ప్రజలు దాని బారిన పడతారు. ముఖ్యంగా నలువైపులా ఉన్న పేదలు మరియు బలహీన వర్గాల ప్రజలు అన్యాయపు చక్రంలో మరింతగా నలిగిపోతారు. ఈ అన్యాయపు పరిధి రోజురోజుకూ విస్తరిస్తూనే ఉంది.

ఇటీవల జరిగిన భారత్, పాక్ యుద్ధ సమయంలో, 2025 మే 9న అహ్మదీయా జమాత్ ఇమామ్ అయిన హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ గారు ప్రసంగించిన శుక్రవారపు ప్రసంగంలో భారతదేశంలోని అహ్మదీయులను ఉద్దేశించి ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేశారు. అహ్మదీయా జమాఅత్ స్థాపకుడు హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ, మసీహ్ మౌఊద్ మరియు మహ్దీ మౌఊద్ గారు రచించిన మహత్తరమైన "పైఘామ్-ఎ-సులహ్" (శాంతి సందేశం) అనే ప్రసంగం వైపు తమ దేశవాసుల దృష్టిని మళ్లించాలని వారు సూచించారు.

నేటికి సుమారు నూట ఇరవై ఐదు సంవత్సరాల క్రితం చేసిన ఆ ప్రసంగంలో, హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ గారు భారతదేశ ప్రజలను ఐక్యత, ఏకమత్యం మరియు జాతీయ సమైక్యత వైపు పిలిచారు. ప్రేమ, ఆప్యాయతలతో నిండిన హృదయ పూర్వకమైన, బాధతో కూడిన సలహాను అందించారు. ఆ సలహా నేటికీ ప్రతి భారతీయుడిని ఆచరణకు ఆహ్వానిస్తోంది.

ఈ సందర్భంలో, ఆ ప్రసంగంలోని కొన్ని భాగాలను అట్టి ఆకాంక్షతో అందిస్తున్నాము: హజ్రత్ ఖలీఫా గారి ఆదేశానుసారం, మనం అహ్మదీయులు వాటిని మన మన భాషల్లో వీలైనంత ఎక్కువగా ప్రచారం చేద్దాము. ఇన్షా అల్లాహ్.

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు ఇలా తెలియజేశారు:

ఓ శ్రోతలారా! మనమందరం, ముస్లింలమైనా, హిందువులమైనా, వందలాది భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఈ ప్రపంచానికి సృష్టికర్త మరియు యజమాని అయిన ఆ దేవున్ని విశ్వసించడంలో భాగస్వాములమే. అలాగే 'మానవులు' అనే పేరులో కూడా మనందరం భాగస్వాములమే. అంటే మనమందరం మనుషులమని పిలువ బడుతున్నాము. అదేవిధంగా ఒకే దేశ వాసులమైనందున పరస్పరం పొరుగు వారము కూడా. కాబట్టి మన కర్తవ్యం ఏమిటంటే, హృదయాలను శుద్ధి చేసుకొని, సదుద్దేశంతో ఒకరికొకరం సహచరులుగా మారాలి. ధర్మం మరియు ప్రాపంచిక జీవితంలోని కష్టాలలో ఒకరికొకరం సానుభూతి చూపుకోవాలి. ఆ సానుభూతి ఎంత దృఢంగా ఉండాలంటే, మనం ఒకరికొకరం శరీరంలోని అవయవాలవలె మారాలి.

ఓ నా దేశ వాసులారా! సహజ సిద్ధమైన మానవ సానుభూతిని బోధించని మతం అసలు మతమే కాదు. మన దేవుడు ఏ జాతి పట్లా వివక్ష చూపలేదు. ఉదాహరణకు, ప్రాచీన ఆర్యావర్త దేశాల ప్రజలకు ప్రసాదించబడిన మానవ శక్తులు, సామర్థ్యాలన్నీ అరబ్బులు, పర్షియన్లు, సిరియన్లు, చైనీయులు, జపానీయులు, యూరప్ మరియు అమెరికా ప్రజలకు కూడా ప్రసాదించబడ్డాయి. అందరి కోసం దేవుని భూమి పరుపులా పరచబడి ఉంది. అందరి కోసం ఆయన సూర్యుడు, చంద్రుడు మరియు అనేక నక్షత్రాలు ప్రకాశించే దీపాలుగా వెలుగుతున్నాయి, ఇంకా అనేక ఇతర సేవలను అందిస్తున్నాయి. ఆయన సృష్టించిన ప్రకృతి మూలకాలు, గాలి, నీరు, అగ్ని, నేల, అలాగే ఆయన సృష్టించిన ఇతర వస్తువులైన ధాన్యాలు, పండ్లు, ఔషధాలు మొదలైన వాటి ద్వారా అన్ని జాతుల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారు. కాబట్టి ఈ దైవిక గుణాలు మనకు కూడా " మనం కూడా మన తోటి మానవులతో మర్యాద, దయ మరియు సౌహార్దంతో ప్రవర్తించాలి, సంకుచిత మనస్సులు గల, సంకుచిత హృదయులుగా మారకూడదు" అనే పాఠాన్ని నేర్పుతున్నాయి.

మిత్రులారా! నిశ్చయంగా గ్రహించండి. మన రెండు జాతులలో ఏ ఒక్క జాతి అయినా దేవుని గుణాలను గౌరవించకుండా, ఆయన పవిత్ర గుణాలకు విరుద్ధముగా వ్యవహరించినచో, ఆ జాతి త్వరలోనే నాశనమవుతుంది. అంతేకాదు, అది తనను తాను మాత్రమే కాకుండా తన సంతానాన్ని కూడా వినాశనంలోకి నెట్టివేస్తుంది."

"ప్రతి మనిషి విశ్వసించవలసినట్టి సత్యమైన, పరిపూర్ణమైన దేవుడు సర్వలోకాలకు ప్రభువు ('రబ్బుల్ ఆలమీన్') అని, ఆయన ప్రభుత్వం ఏదేని ఒక ప్రత్యేక జాతికే, ఏదేని ఒక ప్రత్యేక కాలానికీ, ఏదేని ఒక ప్రత్యేక దేశానికీ మాత్రమే పరిమితం కాదనే విషయాన్ని ఎటువంటి వాదన అవసరం లేకుండానే అంగీకరించవలెను. ఆయనే సమస్త జాతులకు ప్రభువు, సమస్త కాలాలకు ప్రభువు, సమస్త స్థలాలకు ప్రభువు, సమస్త దేశాలకు ప్రభువు. సమస్త అనుగ్రహాలకు ఆయనే మూలస్రోతస్సు. ప్రతి భౌతిక మరియు ఆధ్యాత్మిక శక్తి ఆయన నుండే లభిస్తుంది. సమస్త సృష్టి ఆయన ద్వారానే పోషించబడుతోంది, ప్రతి జీవికి ఆయనే ఆధారం."

దేవుని అనుగ్రహం సార్వజనీనమైనది. అది అన్ని జాతులు, అన్ని దేశాలు మరియు అన్ని కాలాలను ఆవరించి ఉంది. దీనికి కారణం, ఏ జాతికీ 'దేవుడు ఫలానా జాతిపై అనుగ్రహం చేశాడు, కానీ మాపై చేయలేదు' అని ఫిర్యాదు చేసే అవకాశం లేకుండా ఉండటమే.

కాబట్టి మన దేవుని గుణాలు ఇలాంటివిగా ఉన్నప్పుడు, మనం కూడా ఆయన గుణాలను అనుసరించడం సముచితం. అందువల్ల, ఓ నా దేశవాసులైన సోదరులారా! 'పైగామ్-ఎ-సులహ్' (శాంతి సందేశం) అనే ఈ చిన్న పుస్తకాన్ని ఎంతో గౌరవంతో మీ సేవలో సమర్పిస్తున్నాను. మరియు మనస్ఫూర్తిగా ప్రార్థించునదేమనగా, ఆ సర్వశక్తిమంతుడైన దేవుడు స్వయంగా మీ హృదయాలలో ఈ భావాన్ని ప్రేరేపించుగాకా!, మా సానుభూతి యొక్క రహస్యాన్ని మీ హృదయాలకు వెల్లడించుగాకా!. తద్వారా మీరు ఈ స్నేహపూర్వక కానుకను ఏదేని స్వార్థపూరిత ఉద్దేశంతో లేదా వ్యక్తిగత ప్రయోజనంతో ఇచ్చినట్లుగా భావించకూడదు.

ప్రియులారా! పరలోకానికి సంబంధించిన విషయం సాధారణ ప్రజలకు తరచుగా గోప్యంగానే ఉంటుంది. మరణానికి ముందే మరణించిన వారికే పరలోక లోకపు రహస్యం వెల్లడవుతుంది. అయితే ఈ లోకంలోని చెడును మరియు మంచిని ప్రతి దూరదృష్టి కలిగిన వివేకవంతమైన మనిషి గుర్తించగలడు."

ఏ విధంగానూ తొలగించలేని ఆపదలు, ఏ ఉపాయంతోనూ పరిష్కరించలేని కష్టాలు కూడా ఐక్యత వల్ల పరిష్కారమవుతాయనే విషయం ఎవరిపై కూడ గోప్యంగా లేదు. ఐక్యతకు అంతటి శక్తి ఉంటుంది. కాబట్టి ఒక వివేకవంతుడు ఐక్యత యొక్క ఈ శుభఫలాల నుండి తనను తాను దూరం చేసుకోవడం తగదు.

ఈ దేశంలో హిందువులు, ముస్లింలు రెండు గొప్ప జాతులు; ఏదో ఒక సమయంలో హిందువులు సమూహంగా మారి ముస్లింలను ఈ దేశం నుండి బయటకు పంపివేస్తారని, లేదా ముస్లింలు ఏకమై హిందువులను దేశం నుండి వెళ్లగొడతారని ఊహించడం అసాధ్యం. పైగా ఇప్పుడు హిందువులు, ముస్లింలు ఒకరితో ఒకరు విడదీయలేని అనుబంధంలో ఉన్నారు. ఒకరిపై ఏదైనా విపత్తు సంభవిస్తే, మరొకరు కూడా దాని ప్రభావానికి గురి అవుతారు. ఒక జాతి మరొక జాతిని కేవలం తన అహంకారం, ఆధిపత్య భావంతో తక్కువగా చూడాలని ప్రయత్నిస్తే, తాను కూడా అవమానపు మచ్చ నుండి తప్పించుకోలేరు. అలాగే వీరిలో ఎవరైనా తమ పొరుగువారి పట్ల సానుభూతి చూపడంలో విఫలమైతే, దాని నష్టాన్ని తాము కూడా అనుభవించాల్సి వస్తుంది. మీ ఇరు జాతులలో ఏదేని ఒక జాతి వ్యక్తి మరొక జాతి నాశనం గురించి ఆలోచించినట్లయితే, అట్టి వ్యక్తి తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటున్న వ్యక్తి వంటివాడు.

అల్లాహ్ కృపవల్ల మీరు ఇప్పుడు విద్యావంతులయ్యారు. కాబట్టి ఇక విద్వేషాలను విడిచిపెట్టి ప్రేమలో అభివృద్ధి చెందడం మీకు తగినది. పరస్పర నిర్లక్ష్యాన్ని విడిచిపెట్టి సానుభూతిని అవలంబించడం మీ వివేకానికి అనుగుణంగా ఉంటుంది. ప్రాపంచిక కష్టాలు కూడా ఒక ఎడారి ప్రయాణం వంటివి. అది మండే ఎండలో, సూర్యుని తీవ్రమైన వేడి మధ్య సాగించాల్సిన ప్రయాణం. అలాంటి కఠినమైన మార్గంలో పరస్పర ఐక్యత అనే చల్లని నీరు అవసరం. అది మండుతున్న అగ్నిని చల్లార్చడమే కాకుండా, దాహంతో మరణించకుండా మనలను కాపాడుతుంది."

ఇలాంటి సున్నితమైన సమయంలో, మీ ఇరువురికీ శాంతి యొక్క ఆవశ్యకత అధికముగా ఉన్న వేళ, ఈ రచయిత మిమ్మల్ని శాంతి మరియు సఖ్యత వైపు పిలుస్తున్నాడు.

అహ్మదీయా జమాఅత్ గౌరవనీయ స్థాపక మహాశయుల ఉపన్యాసంలోని ఈ దూరదృష్టిని ప్రసాదించే మాటలను నేటి భారతదేశంలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. అల్లాహ్ మనందరికీ ఇందుకు అనుగుణముగా ఆచరించే మరియు ఇందుకై కృషి చేసే సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!. ఆమీన్.



# జుమా ప్రసంగము

**"తమను తాము అత్యంత వినయశీలులుగా మరియు అల్పులుగా భావించే వారు, వినయపూర్వకంగా మాట్లాడేవారు, పేదలను మరియు అవసరంలో ఉన్నవారిని గౌరవించేవారు, నిస్సహాయులను గౌరవంతో చూసేవారు, వారిని ఎప్పుడూ అల్లరి లేదా అహంకారంతో ఎగతాళి చేయనివారు ధన్యులు. వారు తమ కరుణామయుడైన ప్రభువును స్మరిస్తూ, భూమిపై వినయంతో నడుస్తారు. అందువల్ల, అలాంటి వారి కోసమే రక్షణ సిద్ధం చేయబడిందని నేను పదేపదే చెబుతున్నాను.**

**హుజూర్ (అ) పలికిన ప్రతి మాటలో, చేసిన ప్రతి కార్యంలో వినయం స్పష్టంగా వ్యక్తమయ్యేది. వారికి ఒకే ఒక లక్ష్యం ఉండేది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసన్నతను పొందడం, ఆయన సందేశాన్ని ప్రపంచానికి చేరవేయడం, మరియు ఆయన ఏకత్వాన్ని స్థాపించడం.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 29 మే 2026 ( 29 హిజ్రత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

اَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

اَمَّا بَعْدُ فَاَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ- بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ-

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

ఈ రోజు, దైవ ప్రవక్త (స) వారి అనురాగభరితమైన శిష్యుని జీవితంలోని వినయం మరియు అణకువకు సంబంధించిన కొన్ని సంఘటనలను నేను మీతో పంచుకుంటాను. వారు (అ) తన గురువు మరియు మార్గదర్శకుడైన దైవ ప్రవక్త (స) బోధనలు మరియు ఆచరణను అనుసరించడం వల్ల ఈ వినయం వారిలో కల్గింది. ఈ విషయంలో వారు (అ) తన జమాఅత్‌కు అందించిన మార్గదర్శకత్వాన్ని కూడా నేను మీ ముందు ప్రస్తావించుచుతాను.

వారి (అ) వినయానికి ఉన్న ఉన్నతమైన ప్రమాణాన్ని గమనించిన అల్లాహ్ స్వయంగా ఒక దివ్య ప్రకటన ద్వారా దీనిని ధృవీకరించాడు. 18 మార్చి 1907న, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు ఈ దివ్య ప్రకటన అవతరించింది: "నీ వినయపూర్వకమైన మార్గాలు ఆయనకు నచ్చాయి."

(తజ్కిరహ్, 2023, పుట 675)

మరొక చోట హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు:

"నా వినయం, అణకువ, అల్లాహ్‌పై విశ్వాసం, నిష్కపటత, అలాగే సంకేతాలు మరియు దివ్య కాంతి కారణంగా, నేను యేసుమసీహ్ తన పూర్వ జీవితంలో ఉన్న స్థితిని పోలి ఉన్నానని నాకు దివ్యవాణి ద్వారా తెలియజేయబడింది. ఈ వినయపూర్వకుడి స్వభావం మరియు మసీహ్ స్వభావం ఒకదానితో ఒకటి ఎంతో పోలి ఉన్నాయి. అవి ఒకే ఆభరణంలోని రెండు ముక్కలు లేదా ఒకే చెట్టుకు చెందిన రెండు ఫలాల వంటివి. మా మధ్య సామరస్యం ఎంత గొప్పదంటే, ఆధ్యాత్మిక దృష్టితో కూడా మా మధ్య తేడాను గుర్తించడం చాలా కష్టం. మా మధ్య బాహ్యమైన పోలిక కూడా ఉంది. అదేమిటంటే, మసీహ్ పరిపూర్ణమైన మరియు ఉన్నత స్థాయి ప్రవక్త అయిన మూసా (అ) ధర్మానికి అనుచరుడు మరియు సేవకుడు. ఆయన గ్రంథమైన ఇంజీల్, తౌరాత్‌కు ఒక శాఖ వంటిది. అలాగే ఈ భవదీయుడు కూడా 'సయ్యిదుర్-రుసుల్' సమస్త ప్రవక్తల నాయకుడు (స), సమస్త ప్రవక్తల తలమానికం అయిన ఆ మహోన్నత ప్రవక్త (స)కు అత్యంత అల్పమైన సేవకులలో ఒకడిని."

(బరాహీన్-ఎ-అహ్మదీయా, భాగం 4, రూహానీ ఖజాయిన్, సంపుటి 1, పుటలు 593-594, అనుబంధపు, అనుబంధం సంఖ్య 3)

ఒకసారి ఒక వ్యక్తి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)తో ఇలా అన్నాడు: "హుజూర్ (అ) హకీకతుల్-వహీ గ్రంథాన్ని వ్రాస్తూ, దానిని పదేపదే సరిచూస్తూ ఉండడానికి ఎంతో శ్రమించారు." ఈ గ్రంథాన్ని వారు తమ జీవితపు చివరి కాలంలో రచించారు. "దాని కారణంగా హుజూర్ (అ) ఆరోగ్యం పదేపదే క్షీణిస్తోంది. అందువల్ల కొన్ని రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకుని, చదవడం మరియు వ్రాయడం పూర్తిగా మానుకోవాలి. అందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా సమాధాన మిచ్చారు:

"మనం ఎంతగా శ్రమించాము? వాస్తవానికి, సహాబాలు (ర) చేసిన శ్రమను చూసినప్పుడు మనకు సిగ్గుగా అనిపిస్తుంది. వారు అల్లాహ్ మార్గంలో తమ తలలు కూడ ఆనందంగా తెగనిచ్చారు."

(మల్ఫూజాత్, సంపుటి 9, పుట 182, ప్రచురణ 2022)

మరొక చోట హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు:

"అజ్ఞానులు నేను నా స్థాయిని మితిమీరిన విధంగా ఉన్నత పరుచు కుంటున్నానని అభ్యంతరం వ్యక్తం చేస్తారు." అంటే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తన స్వంత స్థాయిని అతిగా పెంచి చూపుతున్నారని వారు అంటారు. మరల ఇలా అన్నారు: "సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సాక్షిగా నేను చెబుతున్నాను. నన్ను నేను ప్రశంసించుకోవాలని, నా గొప్పతనాన్ని ప్రదర్శించడంలో ఆనందించాలనే కోరిక నా స్వభావంలో గానీ, నా మనస్తత్వంలో గానీ లేదు. నేను ఎల్లప్పుడూ వినయం మరియు అజ్ఞాత జీవనాన్నే ఇష్టపడ్డాను. అయితే ఇది నా శక్తికి, నియంత్రణకు అతీతమైన విషయం. ఎందుకంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయంగా నన్ను ముందుకు తెచ్చాడు. ఆయన నాపై అవతరింపజేసిన తన వాక్యాలలో నా గురించి వ్యక్తపరిచినటు వంటి ప్రశంసలు మరియు గొప్పతనం, వాస్తవానికి అవన్నీ పూర్తిగా దైవ ప్రవక్త (స)కు చెందుతాయి."

(మల్ఫూజాత్, సంపుటి 4, పుట 114, ప్రచురణ 2022)

కొత్తగా ఇస్లాంను స్వీకరించిన వారికి కూడా హుజూర్(అ) ఇస్లాం బోధించే వినయం మరియు సరళత వైపు మార్గనిర్దేశం చేసేవారు. ఈ నేపథ్యంలో, 1903 అక్టోబర్ 22న ఆస్ట్రేలియన్‌కు చెందిన నూతన ముస్లిం వ్యక్తి ముహమ్మద్ అబ్దుల్-హక్ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను కలవడానికి వచ్చాడు. సంభాషణ సందర్భంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఆయనతో ఇలా అన్నారు:

"మా సూత్రాలలో ఒక సూత్రమేమనగా, మేము సరళమైన జీవితాన్ని గడుపుతాము. ప్రస్తుతం యూరప్ జీవనానికి అవసరమైనవిగా ప్రకటించిన అన్ని ఆడంబరాలు మరియు లాంఛనాల నుండి మేము దూరంగా ఉన్నాము. మేము ఆచారాలు, సంప్రదాయాలకు బంధింపబడి ఉండము.

అయితే, వాటిని పూర్తిగా విడిచిపెట్టడం వల్ల ఏదైనా హాని కలగవచ్చని లేదా పాపానికి దారితీయవచ్చని భావించి, ప్రతి సంప్రదాయాన్ని ఒక నిర్దిష్ట పరిమితి వరకు మాత్రమే పాటిస్తాము. (అంటే, దానిని విడిచిపెట్టడం వల్ల హాని కలగకూడదు లేదా పాపానికి దారితీయకూడదు.) ఒక, తినడం, త్రాగడం మరియు మన సామాజిక జీవనం విషయానికి వచ్చినచో మేము సరళమైన జీవితాన్నే ఇష్టపడతాము."

(మల్ఫూజాత్, సంపుటి 5, పుటలు 294 మరియు 298-299, ప్రచురణ 2022)

ఈ వినయపు ఉన్నత ప్రమాణాలను తన అనుచరులలో జనింపజేయాలని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కోరుకున్నారు. ఈక్రమంలోనే వారు (అ) ఇలా అన్నారు:

"ఒక వ్యక్తి వినయాన్ని అలవరచుకోవాలి. వినయాన్ని అలవర్చుకోవడం కష్టం కాదు. నిజానికి, అందులో అలవర్చుకోవడానికి ఏముంది? మనిషి సహజంగానే వినయశీలుడు; అతడు వినయం కోసం సృష్టించబడ్డాడు. మా ఖలఖ్‌తుల్ జిన్నా వల్ ఇన్‌సా ఇల్లా లియఅబుదూన్" అనగా నేను జిన్నాతులను మరియు మానవులను నన్ను ఆరాధించడానికి తప్ప మరే ఉద్దేశంతోనూ సృష్టించలేదు. "గర్వం, అహంకారం మొదలైనవి అన్నీ కృత్రిమ లక్షణాలు. ఒక వ్యక్తి ఈ కృత్రిమ ప్రదర్శనను తొలగించు కుంటే, అతని సహజ స్వభావంలో భాగంగా వినయం మాత్రమే కనిపిస్తుంది."

(మల్ఫూజాత్, సంపుటి 5, పుట 38, ప్రచురణ 2022)

కావున, ఈ సూత్రం ద్వారా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సాన్నిత్యాన్ని పొందవచ్చును.

ప్రజలు వినయాన్ని అలవరచుకోవాలని మరింతగా ప్రోత్సహిస్తూ, మరోచోట వారు (అ) ఇలా అన్నారు:

"తమను తాము అత్యంత వినయశీలులుగా మరియు అల్పులుగా భావించే వారు, వినయపూర్వకంగా మాట్లాడేవారు, పేదలను మరియు అవసరంలో ఉన్నవారిని గౌరవించేవారు, నిస్సహాయులను గౌరవంతో చూసేవారు, వారిని ఎప్పుడూ అల్లరి లేదా అహంకారంతో ఎగతాళి చేయనివారు ధన్యులు. వారు తమ కరుణామయుడైన ప్రభువును స్మరిస్తూ, భూమిపై వినయంతో నడుస్తారు. అందువల్ల, అలాంటి వారి కోసమే రక్షణ సిద్ధం చేయబడిందని నేను పదేపదే చెబుతున్నాను. అల్లరి, అహంకారం, ఆత్మగర్వం, దర్పం, ప్రాపంచిక ఆరాధన, అత్యాశ మరియు అనైతికత అనే నరకం నుండి ఈ లోకంలోనే విముక్తి పొందని వ్యక్తి, పరలోకంలో కూడా వాటి నుండి ఖచ్చితముగా విముక్తి పొందలేడు. (అంటే, ఈ జీవితంలో వారు చేసే సత్కార్యాలు తదుపరి జీవితంలో వారికి ప్రయోజనం చేకూరుస్తాయి.) ఈ ప్రజల హృదయాలను ప్రభావితం చేసే విధంగా నేను ఏమి చేయాలి? అలాంటి మాటలను ఎక్కడి నుంచి తీసుకు రావాలి?" "ఓ నా ప్రభూ! నాకు అలాంటి మాటలను ప్రసాదించు. ఈ హృదయాలను వెలుగుతో ప్రకాశింపజేసే, వాటిలోని విషాన్ని తమ చికిత్సా గుణాలతో

తొలగించే విధంగా అలాంటి ప్రసంగాలను నాకు నేర్పించు! నా సమస్త అస్తిత్వం ఒక లోతైన ఆకాంక్షతో కొట్టుమిట్టాడుతోంది. ఒక రోజు నా సంఘంలో అనేకమంది నిజంగా అసత్యాన్ని విడిచిపెట్టి, తమ ప్రభువుతో హృదయపూర్వకమైన నిబద్ధత చేసుకున్న వారిని నేను చూడాలి. వారు అన్ని రకాల చెడుల నుండి తమను తాము కాపాడుకుంటామని, సమస్త అల్లరి మరియు చెడుకు మూలమైన అహంకారానికి పూర్తిగా దూరంగా ఉంటామని, తమ ప్రభువుకు భయభక్తులతో జీవిస్తామని నిజాయితీగా ప్రతిజ్ఞ చేసి ఉండాలి."

(షహాదతుల్ ఖుర్ఆన్, రూహానీ ఖజాయిన్, సంపుటి 6, పుట 398)

కొంతమంది జల్సాలు, కార్యక్రమాలు లేదా ఇతర సమావేశాలలో ముందు వరుసలలో కూర్చోవాలని కోరుకుంటారు. ముఖ్యంగా జల్సాలలో, ముందు భాగంలో గ్రీన్ ఏరియా లేదా ఇలాంటి ప్రత్యేక విభాగాలు ఉంటాయి. వాటిలో కూర్చోవాలనే బలమైన కోరిక కొందరిలో కనిపిస్తుంది. వర్తమాన ఖలీఫాను మరింత దగ్గరగా చూడటానికి, వినటానికి మాత్రమే ఆ కోరిక ఉంటే, అది అర్థం చేసుకోదగినదే. అయితే, కొన్నిసార్లు అది అహంకారం లేదా ఆత్మగౌరవం కారణంగా కనిపిస్తుంది. అలా ఉండకూడదు. అంతేకాకుండా, ఇటువంటి వైఖరి కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన వారికి ఇబ్బందులను కూడా కలిగించవచ్చు.

ఏదేమైనప్పటికీ, ఇటువంటి కోరికలను కలిగి ఉన్నవారికి హితబోధ చేస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా అన్నారు:

"ఒక వ్యక్తి ఎక్కడికైనా వెళ్లినప్పుడు తన కోసం అత్యంత తక్కువ స్థలాన్ని ఎంచుకోవాలి. అతడు ఉన్నత స్థానానికి అర్హుడైతే, ఆతిథేయుడే స్వయంగా అతన్ని ముందుకు పిలిచి, అతనికి అట్టి స్థానం ఇచ్చి, గౌరవిస్తాడు."

(మల్ఫూజాత్, సంపుటి 5, పుట 93, ప్రచురణ 2022)

ఒకవేళ కూర్చునే ఏర్పాట్లకు సంబంధించి ఒక విధానం అమల్లో ఉండి, ఎవరైనా ఒక నిర్దిష్ట ప్రదేశంలో కూర్చోవాలని కోరుకుంటే, అది సముచితమే , దానికి అనుసరించాల్సిన ఒక ప్రక్రియ ఉంది. ఒకరు తమ అభ్యర్థనను సమర్పించవచ్చు, మరియు నిర్వాహక వ్యవస్థ దానిని పరిశీలిస్తుంది. అయితే, పాలన వ్యవస్థ వారి అభ్యర్థనను ఆమోదించకపోతే, లేదా పరిస్థితుల కారణంగా దానిని అమలు చేయడం సాధ్యం కాకపోతే, ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయకుండా ఆ నిర్ణయాన్ని అంగీకరించాలి. అంతేకాకుండా, తమ హృదయంలో ఎటువంటి ఫిర్యాదు లేదా మనోవేదనకు చోటివ్వకూడదు.

అల్లాహ్ ప్రేమను పొందడానికి వినయం కూడా ఎంతో అవసరం. ఈ విషయమై హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు:

"తమలో ఈ రెండు లక్షణాలను పెంపొందించుకునే వరకు ఎవరూ అల్లాహ్ ప్రేమను మరియు ఆయన సంతోషాన్ని పొందలేరు. మొదటిది, ఎత్తుగా నిలిచిన ఒక పర్వతం కూలిపోయి నేలమట్టమయ్యే విధంగా, మనిషి తన అహంకారాన్ని ఛిన్నాభిన్నం చేసుకోవాలి. అదే విధంగా, అహంకారం మరియు ఆధిక్యతకు సంబంధించిన తన ఆలోచనలన్నింటినీ తొలగించుకోవాలి. వినయాన్ని మరియు అణకువను అలవర్చుకోవాలి. "రెండవది, ఒక పర్వతం కూలిపోయి నేలమట్టమై పోయినట్లుగా, తన ప్రాపంచిక అనుబంధాలన్నింటినీ తెంచుకోవాలి. దీనికి సంబంధించిన పదం: ముతసద్దిఅన్. పవిత్ర ఖుర్ఆన్‌లో ముతసద్దిఅన్ అనే పదం ప్రస్తావించబడింది; అంటే ముక్కలుగా విడిపోవడం. అదే విధంగా, అపవిత్రతకు మరియు దైవ అసంతృప్తికి కారణమయ్యే వ్యక్తి యొక్క గత అనుబంధాలన్నీ తెంచబడాలి." దీని అర్థం ఏమిటంటే, మనిషిని చెడువైపు నడిపిస్తూ, అతని స్వభావాన్ని చెడగొడుతున్న పాత అనుబంధాలను తెంచుకోవాలి. అనగా అన్ని రకాల కుటుంబ బంధాలను మరియు సంబంధాలను పూర్తిగా తెంచుకోవాలని కాదు. దానికి బదులుగా, హానికరమైన అనుబంధాలను తొలగించుకోవడం ద్వారా ధర్మనిష్ఠత వైపు ఆసక్తి ఏర్పడేలా చేసుకోవాలి. "తరువాత తమ సమావేశాలు, స్నేహాలు, ప్రేమలు, ఇంకా శత్రుత్వాలు కూడా కేవలం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కోసమే ఉండాలి. తాను చేపట్టే ప్రతి కార్యం అల్లాహ్ సంతోషాన్ని పొందడానికే ఉద్దేశించబడాలి."

(మల్ఫూజాత్, సంపుటి 2, పేజీ 171, ప్రచురణ 2022)

మరొక సందర్భంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా అన్నారు:

"పాపం నుండి రక్షణ కోసం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ ప్రార్థనను మనకు నేర్పించాడు: ఇయ్యాక నఅబుదు వ ఇయ్యాక నస్తయీన్ అనగా మేము నిన్నే ఆరాధిస్తాము మరియు మేము నీ సహాయాన్నే కోరుకుంటాము. "తమ ప్రభువు సమక్షంలో వినయంతో నిరంతరం ప్రార్థిస్తూ, తమలోని ఏదైనా అణకువ మరియు దీనత్వపు చర్య ఆమోదించబడాలని ఆశించే వారికి, అల్లాహ్ స్వయంగా సహాయకుడిగా మారుతాడు." ఈ సందర్భంలో హుజూర్ (అ) ఒక సంఘటనను వివరించారు: "ఒక భక్తిపరుడైన ఆరాధకుడు విస్తారంగా ప్రార్థిస్తూ, 'ఓ అల్లాహ్! నాకు పాపం నుండి విముక్తిని ప్రసాదించు' అని వేడుకునేవాడు. చాలాకాలం ప్రార్థించిన తరువాత, అత్యున్నత స్థాయి వినయాన్ని ఎలా, ఏ విధంగా పొందగలనో అని అతను ఆలోచించసాగాడు. ఏ రూపంలోని వినయం అత్యంత సంపూర్ణంగా ఉంటుందో అతను పరిశీలించాడు. చివరకు, కుక్కకంటే వినయపూర్వకమైన జీవి మరొకటి లేదని భావించాడు. అందువల్ల, అతను కుక్కలా ఏడుస్తూ, దాని అరుపును అనుకరించడం ప్రారంభించాడు. "మరో వ్యక్తి ఆ శబ్దాన్ని విని, ఒక కుక్క మసీదులోకి ప్రవేశించిందని అనుకున్నాడు. అది తన పాత్రను అపవిత్రం చేస్తుందేమోనని భయపడి, పరిశీలించడానికి వచ్చాడు. అతను చూసినప్పుడు అక్కడ కుక్క ఏదీ లేదు. ఆరాధకుడు మాత్రమే ఉన్నాడు."చివరకు అతను, 'ఇక్కడ ఒక కుక్క ఏడుస్తున్న శబ్దం నాకు వినిపించింది. అది ఎవరు?' అని అడిగాడు."ఆ ఆరాధకుడు, 'అది నేనే. నేనే ఆ కుక్కను' అని సమాధానమిచ్చాడు."ఆ వ్యక్తి, 'మీరు అలా ఎందుకు ఏడుస్తున్నారు?' అని అడిగాడు."అతను, 'సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వినయాన్ని ప్రేమిస్తాడు. అందువల్ల, ఈ విధంగా నేను చూపించే వినయం బహుశా అంగీకరించబడుతుందని నేను భావించాను' అని సమాధానమిచ్చాడు."

(మల్ఫూజాత్, సంపుటి 5, పేజీ 210, ప్రచురణ 2022)

ఇది, వాస్తవానికి, ఆ వ్యక్తి యొక్క స్వీయ ఆలోచనా విధానం. ఆ అవగాహనకు అనుగుణంగానే అతడు నడుచుకున్నాడు. అల్లాహ్ సాన్నిహిత్యాన్ని ఎలాగైనా పొందాలనే ఉద్దేశంతో, సృష్టిలో తానే అత్యల్పుడు, అత్యంత అల్పమైనవాడు కావాలని అతడు కోరుకునేవాడు.

మరొక సందర్భంలో హుజూర్ (అ) మరల ఇలా పేర్కొన్నారు:

" మానవుడు ఒక వినయశీలుడు. తన స్వీయ కార్యాల ఫలితాల కారణంగా తాము గొప్పవారమని భావించడం ప్రారంభిస్తారు. (ఒక వ్యక్తి చేసిన పనుల ఫలితమే అతనిలో ఈ గొప్పతన భావాన్ని కలిగిస్తుంది.) ఆ వ్యక్తిని గర్వం మరియు అహంకారం ఆవహిస్తాయి. అల్లాహ్ మార్గంలో, ఒక వ్యక్తి తనను తాను సర్వసృష్టిలోకెల్లా అత్యల్పుడిగా భావించే వరకు, అతడు విముక్తిని పొందలేడు."

(మల్ఫూజాత్, సంపుటి 5, పుట 138, ప్రచురణ 2022)

తన బైఅత్‌లో ప్రవేశించిన వారికి అత్యున్నత స్థాయి వినయాన్ని అలవరచుకోవాలని బోధిస్తూ, హుజూర్ (అ) ఇలా పేర్కొన్నారు:

"ఈ బైఅత్, వాస్తవానికి, తనను తాను అమ్ముకోవడం అని అర్థం. దాని శుభములు మరియు ప్రభావాలు కూడా ఈ పరిస్థితితోనే ముడిపడి ఉన్నాయి. ఇది భూమిలో విత్తబడిన విత్తనం వంటిది. దాని ప్రారంభ స్థితి ఏమిటనగా, రైతు చేతితో విత్తనాన్ని నేలలో విత్తుతాడు; ఆ తరువాత అది ఏమవుతుందో ఎవరికీ తెలియదు. (అది నేలలో లోతుగా పాతిపెట్టబడి, కంటికి కనిపించకుండా ఉంటుంది; అది ఏమవుతుందో ఎవరికీ తెలియదు.) అయితే ఆ విత్తనం మంచి నాణ్యత కలిగి, ఎదిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటే, అల్లాహ్ కృపతో మరియు రైతు కృషి ద్వారా అది నేలపైకి మొలకెత్తుతుంది. (దాని మొలకలు మరియు రెమ్మలు కనిపిస్తాయి.) చివరకు ఒక గింజ వేలాది గింజలను ఉత్పత్తి చేస్తుంది. అదేవిధంగా, బైఅత్‌లో ప్రవేశించే వ్యక్తి మొదట అత్యంత వినయాన్ని, అణకువను అలవరచుకోవాలి. తన స్వార్థం మరియు కోరికల నుండి తనను తాను వేరుచేసుకోవాలి. అప్పుడే అతడు ఎదగడానికి అర్హత పొందుతాడు. అయితే బైఅత్‌లో ప్రవేశించినప్పటికీ తన స్వార్థాన్ని విడిచిపెట్టని వ్యక్తి, దాని ద్వారా ఎన్నటికీ ప్రయోజనం పొందలేడు. (వినయం లేకుండా బైఅత్ వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు.)"

(మల్ఫూజాత్, సంపుటి 5, పుటలు 306-307, ప్రచురణ 2022)

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు:

"మీరు ఎంత ఎక్కువ సౌమ్యతను అలవరచుకుంటారో, ఎంత ఎక్కువ అణకువ మరియు వినయాన్ని ప్రదర్శిస్తారో, అంత ఎక్కువగా అల్లాహ్ మీ పట్ల సంతోషిస్తాడు." (మల్ఫూజాత్, సంపుటి 9, పుట 66, ప్రచురణ 2022)

మరల హుజూర్ (అ) ఇలా పేర్కొన్నారు:

"వినయం ద్వారా సర్వశక్తిమంతుడైన దేవుని ప్రీతిని కోరుకునే వ్యక్తి పట్ల అల్లాహ్ సంతోషిస్తాడు." (మల్ఫూజాత్, సంపుటి 9, పుట 211, ప్రచురణ 2022)

ఆ తరువాత, వినయం ద్వారా ఏమి లభిస్తుంది మరియు అహంకారం చివరకు ఒక వ్యక్తిని ఎక్కడికి తీసుకెళ్తుందో వివరిస్తూ వారు (అ) ఇలా పేర్కొన్నారు:

"ఆదమ్ మొదట పాపం చేశాడు. అలాగే సైతాను కూడా పాపం చేశాడు. అయితే ఆదమ్‌లో అహంకారం లేదు. అందువల్ల ఆయన సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముందు తన తప్పును అంగీకరించాడు, కావున ఆయన పాపం క్షమించబడింది. దీని ద్వారా మనుషులు పాపాలకు పశ్చాత్తాపం ద్వారా క్షమాపణ లభిస్తుందనే ఆశను పొందుతారు. (అల్లాహ్ తాలా ఆదమ్‌ను క్షమించినందున, వినయాన్ని ప్రదర్శించి పశ్చాత్తాపపడే వ్యక్తి కూడా అల్లాహ్ తనను క్షమిస్తాడనే ఆశను కలిగి ఉండాలి.) అయితే సైతాను అహంకారానికి లోనయ్యాడు. అందువల్ల శపించబడినవాడయ్యాడు. (అల్లాహ్ శాపం అతనిపై పడింది.) ఈ మానవ లక్షణం షైతాన్‌లో లేని కారణంగా జరిగింది. (సైతానులో ఉండే లక్షణాలు మానవుల్లో లేవు. ఎందుకంటే మనుషులు వినయాన్ని అలవరచుకోగలరు.) అహంకారి వ్యక్తి ఎల్లప్పుడూ తనలో ఒక గుణాన్ని ఉందని ప్రకటించుకోవడానికి సిద్ధపడతాడు (ఈ సందర్భంలో, వినయం గురించి). అహంకారం మానవ స్వభావంలో సహజంగా ఉండవలసినది కాదు. అయినప్పటికీ, సైతాను చేసినట్లుగానే, ఒక వ్యక్తి ఎటువంటి కారణం లేకుండానే తన గొప్పతనాన్ని ప్రకటించడం ప్రారంభిస్తాడు." మరల ఇలా తెలిపారు. "ప్రవక్తలకు

అనేక గొప్ప గుణాలు ఉంటాయి. వాటిలో ఒకటి స్వీయ నిర్మూలన అంటే, తన అహంకారాన్ని మరియు స్వార్థపూరిత 'నేను' అనే భావాన్ని అణచివేయడం. స్వార్థం వారిలో ఉండదు. వారు తమ స్వీయ అహంకారానికి ఒక విధమైన మరణాన్ని కలిగిస్తారు. గొప్పతనం అల్లాహ్‌కు మాత్రమే చెందుతుంది. అహంకారంగా ప్రవర్తించకుండా, బదులుగా వినయాన్ని అలవరచుకునే వారు ఎన్నటికీ నాశనం కారు." (మల్ఫూజాత్, సంపుటి 9, పుట 173, ప్రచురణ 2022)

మరల తన జమాఅత్‌కు వినయాన్ని అలవరచుకోవాలని ఉపదేశిస్తూ, హుజూర్ (అ) ఒకసారి ఇలా పేర్కొన్నారు:

"నేటికీ జమాఅత్‌లో అనేక మంది ఉన్నారు. వారు తమ వ్యక్తిగత అభీష్టాలకు విరుద్ధంగా అత్యంత స్వల్పమైన విషయం వినిపించినా వారు కోపోద్రిక్తులవుతారు. అయితే, సహనం, ఓర్పు మరియు ఆత్మనిగ్రహం మన స్వభావంలో అభివృద్ధి చెందాలంటే, ఇటువంటి భావోద్వేగాలన్నింటినీ అణచుకోవడం అత్యవసరం. చాలా చిన్న విషయంపై చర్చ ప్రారంభమై, ప్రతి ఒక్కరూ ఎదుటివారిని ఓడించడంపైనే దృష్టి పెట్టడం తరచుగా గమనించబడుతుంది. 'నేను ఎలా విజయం సాధించాలి? ఎదుటివారిని ఎలా అదుపులోకి తెచ్చుకోవాలి?' అనే ఆలోచనతో ఒకరు మరొకరిపై ఆధిపత్యం చెలాయించాలని కోరుకుంటారు. అలాంటి సమయాల్లో, వ్యక్తి తన భావోద్వేగ ప్రేరణల నుంచి తనను తాను కాపాడుకోవాలి. విభేదాలను తొలగించే ఉద్దేశంతో, అత్యంత చిన్న విషయాల్లోనైనా ఉద్దేశపూర్వకంగా వినయాన్ని ఎంచుకోవాలి. తోటి సోదరుడిని అవమానించడానికి ఎప్పుడూ ప్రయత్నించకూడదు."

(మల్ఫూజాత్, సంపుటి 6, పేజీ 65, ఫుట్‌నోట్, ప్రచురణ 2022)

దీనిని మన జీవితాల్లో పరిశీలిస్తే, తప్పుడు గౌరవ భావనతో, స్వార్థపూరితంగా ప్రవర్తించే అనేక మందిని మనం చూడగలుగుతాము. దీని కారణంగా వివాదాలు మరింత పెరుగుతాయి. అయితే, ఒక వ్యక్తి నిజంగా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సాన్నిత్యాన్ని కోరుకుంటే, అతడు రక్షణను పొందగలడు. కొందరు ఇతరులకు హాని చేయడానికి కూడా ప్రయత్నిస్తారు. కొన్నిసార్లు, వారు దురుద్దేశంతో ఫిర్యాదులు చేస్తూ, ఏదో ఒక విభేదం సమయంలో ఫలానా వ్యక్తి తమతో చెడుగా మాట్లాడాడని చెబుతారు. ఆ తరువాత, అన్యాయముగా ఆ వ్యక్తిని తప్పుడు కేసులో ఇరికించడానికి లేదా ఏదో ఒక శిక్షకు గురిచేయడానికి ప్రయత్నిస్తారు.

మరో సందర్భంలో, వినయశీలులైన ప్రజలు మరణించిన తరువాత వారి పరిస్థితిని వివరిస్తూ, హుజూర్ (అ) ఇలా పేర్కొన్నారు:

"మరణం ప్రతి ఒక్కరికీ నిర్ణయించబడింది. ఒక రోజు ప్రతి మనిషి ఈ లోకాన్ని విడిచిపెట్టాలి. త్వరగానో ఆలస్యంగానో ప్రతి ఒక్కరూ అదే గమ్యాన్ని చేరుకుంటారు. అయితే, పేదరికంలో, ఆడంబరాలకు దూరంగా, దీనత్వం మరియు వినయంతో మరణించేవారిని స్వీకరించే తీరు స్వర్గమే వారిని స్వాగతించడానికి ముందుకు వచ్చినట్లు అనిపిస్తుంది.

హజ్రత్ ఈసా (అ) లాజరస్ గురించి చెప్పినట్లుగా."

(మల్ఫూజాత్, సంపుటి 8, పేజీలు 289–290, ప్రచురణ 2022)

ఇక్కడ ప్రస్తావించబడిన లాజరస్ ఎవరు?. ఈ సంఘటన లూకా సువార్త 16వ అధ్యాయంలో నమోదు చేయబడింది. ఒక ధనవంతుడు ఉండేవాడు. అతడు ఊదారంగు వస్త్రాలు మరియు విలాసవంతమైన దుస్తులు ధరించేవాడు. రంగు రంగుల, మృదువైన, ఖరీదైన వస్త్రాలను ధరించి, ప్రతిరోజూ సంతోషంగా, ఉత్సవ వాతావరణంలో, వైభవంగా జీవించేవాడు. సువార్త (ఇంజీల్) లో ఇలా నమోదు చేయబడింది: "లాజరస్ అనే ఒక పేదవాడు కూడా ఉండేవాడు. అతని శరీరం పుండ్లతో నిండి ఉండేది, చర్మవ్యాధితో బాధపడేవాడు. అతడిని ఆ ధనవంతుని గుమ్మం వద్దకు తీసుకువచ్చి, అతని ఇంటి వెలుపల కూర్చోబెట్టేవారు." ధనవంతుని బల్లపై నుంచి పడిపోయే ఆహారపు ముక్కలతో తన కడుపు నింపుకోవాలన్నదే అతని కోరిక. అంటే, మిగిలిపోయి బయటకు పడేసిన ఆహారంలో కొంతైనా తినాలని అతడు ఆశించేవాడు. అంతేకాకుండా, కుక్కలు వచ్చి అతని పుండ్లను నాకేవి. అతడు ఎంత దయనీయమైన, బలహీనమైన స్థితిలో ఉన్నాడంటే, ఆ కుక్కలను తరిమికొట్టే శక్తి కూడా అతనికి లేకపోయేది. అవి వచ్చి అతని గాయాలను నాకేవి. అలా, బైబిల్లో నమోదు చేయబడిన ప్రకారం, ఆ పేదవాడు మరణించాడు. దేవదూతలు అతడిని తీసుకెళ్లి అబ్రాహాము పక్కన చేర్చారు. ఆ ధనవంతుడు కూడా మరణించి సమాధి చేయబడ్డాడు. మృతుల లోకంలో తన బాధలో తీవ్రంగా వేదనపడుతూ, బైబిలు ప్రకారం, అతడు తన కళ్లను పైకెత్తి దూరంగా అబ్రాహామును, అతని పక్కన లాజరస్‌ను చూశాడు. అప్పుడు అతడు ఇలా కేకవేశాడు: "తండ్రి అబ్రాహామా, నాపై కనికరించు. లాజరస్‌ను పంపించు. అతడు తన వేలు కొనను నీటిలో ముంచి నా నాలుకను చల్లబరచాలి. లాజరస్‌ను నా దగ్గరకు పంపించు. ఈ వేదన నుంచి నన్ను కూడా విముక్తి చేయి. కనీసం నా నాలుకపై ఒక నీటి బొట్టైనా ఉంచనివ్వు. ఎందుకంటే నేను ఈ అగ్నిలో తీవ్రంగా బాధపడుతున్నాను." అబ్రాహాము ఇలా అన్నాడు: "కుమారుడా!, నీ జీవితకాలంలో నీవు నీ మంచివాటిని పొందావని, లాజరస్ చెడ్డవాటిని పొందాడని జ్ఞాపకం చేసుకో. కానీ ఇప్పుడు అతడు ఇక్కడ ఓదార్పు పొందుతున్నాడు, నీవు వేదనలో ఉన్నావు." (లూకా 16:19-25) అహంకారుల అంతిమ గతి ఇదేనని హుజూర్ (అ) వివరించారు.

"ఒక వ్యక్తి ఉన్నత వంశానికి చెందిన వ్యక్తితో లేదా ఉన్నత స్థితిలో ఉన్న వ్యక్తితో వ్యవహరించినట్లుగా ఒక పేద, నిస్సహాయమైన వృద్ధ స్త్రీతో వ్యవహరించనంత వరకు ,అలాగే అన్ని రకాల గర్వం, దర్పం మరియు అహంకారం నుంచి తనను తాను కాపాడుకునే వరకు, అతడు ఎట్టి పరిస్థితుల్లోనూ సర్వశక్తిమంతుడైన దేవుని రాజ్యంలో ప్రవేశించలేడు."

(మల్ఫూజాత్, సంపుటి 5, పేజీ 138, ప్రచురణ 2022)

మరల హుజూర్ (అ) ఇలా పేర్కొన్నారు:

"అహంకార వ్యక్తి అల్లాహ్ సింహాసనంపై కూర్చోవాలని కోరుకుంటాడు. కాబట్టి, మీరు ఎల్లప్పుడూ ఈ నీచమైన లక్షణం నుండి ఆశ్రయం కోరుతూ ఉండాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క వాగ్దానాలన్నీ మీకు అనుకూలంగా ఉన్నప్పటికీ, మీరు వినయాన్ని ప్రదర్శించాలి. ఎందుకంటే వినయాన్ని ప్రదర్శించేవాడే అల్లాహ్‌కు ప్రియమైనవాడు."

(మల్ఫూజాత్, సంపుటి 10, పుట 217, ప్రచురణ 2022)

వినయం మరియు అణకువకు సంబంధించిన ఒక సంఘటనను వివరిస్తూ, హుజూర్ (అ) ఇలా పేర్కొన్నారు:

"వినయం మరియు అణకువ అనేవి గొప్ప గుణాలు. ఒక వ్యక్తి అవసరంలో ఉన్నప్పటికీ అహంకారంతో ఉంటే, అతడు తన కోరికలను నెరవేర్చుకోలేడు. అతడు వినయాన్ని అలవరచుకోవాలి. గాలెన్ అనే వైద్యుడు ఒక రాజు వద్ద పనిచేసేవాడని చెప్పబడింది. (ఇది మరొక సంఘటన.) ఆ రాజు అనారోగ్యకరమైన ఆహారాన్ని తినడం అలవాటుగా చేసుకున్నాడు. దాని కారణంగా రాజుకు కుష్ఠవ్యాధి వస్తుందని గాలెన్‌కు నిశ్చయంగా తెలుసు. (అతని ఆహారపు అలవాట్లు ఆరోగ్యకరంగా ఉండేవి కావు. నేటికీ ప్రజలు జంక్ ఫుడ్ తినడం వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ కాలంలో కూడా ఇలాంటి ఆహార పదార్థాలు ఉండి ఉండవచ్చు. ఏదేమైనా, ఆ ఆహారం అతడిని అనారోగ్యానికి గురిచేసి, చివరకు కుష్ఠవ్యాధికి దారితీస్తుందని గాలెన్‌కు నిశ్చయంగా తెలుసు.) అందువల్ల, అతడు రాజును ఎల్లప్పుడూ వారిస్తూ ఉండేవాడు. కానీ రాజు తన అలవాటును మానుకోలేదు. చివరకు విసిగిపోయిన గాలెన్ తన దేశానికి తిరిగి వెళ్లిపోయాడు. (అతడు రాజు సేవను విడిచి తన స్వదేశానికి వెళ్లిపోయాడు.) కొంతకాలం తరువాత రాజు శరీరంపై కుష్ఠవ్యాధి లక్షణాలు కనిపించాయి. (గాలెన్ హెచ్చరించినదే చివరకు జరిగింది, రాజుకు కుష్ఠవ్యాధి సోకింది.) అప్పుడు రాజు తన తప్పును గ్రహించి వినయాన్ని అలవరచుకున్నాడు. తన కుమారుడిని సింహాసనంపై కూర్చోబెట్టి, తాను సాధారణమైన దుస్తులు ధరించి అక్కడి నుండి వెళ్లిపోయాడు. అతడు గాలెన్ వద్దకు చేరుకున్నాడు. గాలెన్ అతడిని గుర్తించి, రాజు తన తప్పును గ్రహించి తన వద్దకు వచ్చినందుకు అతని వినయాన్ని ప్రశంసించాడు. అనంతరం అతడు రాజుకు పూర్తి శ్రద్ధతో చికిత్స చేయడం ప్రారంభించాడు. అప్పుడే అల్లాహ్ ఆ రాజును స్వస్థ పరిచాడు."

(మల్ఫూజాత్, సంపుటి 9, పుటలు 177-178, ప్రచురణ 2022)

ఒకసారి తన సభలో దైవిక ప్రకటనను ప్రస్తావిస్తూ, హుజూర్ (అ) ఇచ్చిన ఉపదేశం ఒక కథనంలో ఈ విధంగా నమోదైంది:

ఫజర్ నమాజు అనంతరం హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వచ్చి ఒక సంక్షిప్త సభను నిర్వహించారు. వాస్తవానికి, హుజూర్ ఫజర్ నమాజుకు ముందే వచ్చి ఒక సభను నిర్వహించారు మరియు ఈ దైవిక ప్రకటన గురించి మాట్లాడారు: " ఇన్ని ఉహాఫిజు కుల్లమన్ ఫిద్దార్ ఇల్లల్లజీన అలౌ వస్తక్బరు " అనగా "ఈ గృహంలో నివసించే వారందరినీ నేను రక్షిస్తాను. అయితే తమను తాము ఉన్నతులుగా భావించి అహంకరించే వారిని మాత్రం కాదు." హుజూర్ (అ) మరల ఇలా తెలిపారు. "ఇక్కడ 'తమను తాము ఉన్నతులుగా భావించడం మరియు అహంకరించడం' అంటే సంపద మరియు హోదా విషయంలో చూపే అహంకారం మాత్రమే కాదు. అల్లాహ్ సమక్షంలో వినయంతో మరియు విధేయతతో తనను తాను సమర్పించుకోని, ఆయన ఆజ్ఞలను పాటించని ప్రతి వ్యక్తి ఇందులోకి వస్తాడు. అతడు పేదవాడైనా సరే."

(మల్ఫూజాత్, సంపుటి 3, పుటలు 443-444, ప్రచురణ 2022)

వినయాన్ని ప్రదర్శించేవాడే ఈ గృహంలో ప్రవేశించగలడు. మరొక సందర్భంలో హుజూర్ (అ) ఇలా పేర్కొన్నారు:

"ఒక వ్యక్తి విజయాన్ని సాధించినపుడు, ఇక నిస్సహాయత మరియు కష్టాల స్థితిలో లేనప్పుడు, అట్టి సమయంలో అణకువను అవలంబించి అల్లాహ్‌ను స్మరించినచో అట్టి వ్యక్తే నిజమైన జ్ఞాని."

(మల్ఫూజాత్, సంపుటి 1, పుట 417, ప్రచురణ 2022)

ఇవి హుజూర్ (అ) జమాఅత్‌కు ఇచ్చిన కేవలం ఉపదేశాలు మాత్రమే కాదు. తన స్వీయ నడవడిక ద్వారా కూడా వారు(అ) వీటిని ఆచరించి, నిరూపించారు. ప్రారంభంలో నేను ఒక ఉదాహరణను ఇచ్చినట్లుగా, వారి (అ) నడవడిక కూడా అల్లాహ్ సమక్షంలో ఆమోదయోగ్యమైనదిగా నిలిచింది. ఏదేమైనా, కొన్ని కథనాలు హుజూర్ (అ) నడవడికకు సంబంధించినవి గలవు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఒక కథనాన్ని ఇలా వివరించారు. మిర్జా సుల్తాన్ అహ్మద్ సాహిబ్ వారితో ఇలా చెప్పారు: మా తాతగారు మా పెదనాన్నా మిర్జా గులామ్ ఖాదిర్ సాహిబ్‌కు ఒక కుర్చీ ఇచ్చేవారు. (అంటే, మిర్జా సుల్తాన్ అహ్మద్ సాహిబ్ తాతగారు హుజూర్ (అ) గారి అన్నయ్యకు కుర్చీ ఇచ్చేవారు.) ఆయన మా తాతగారి సభకు వచ్చినప్పుడు కుర్చీలో కూర్చోబెట్టబడేవారు. కానీ మా తండ్రి మాత్రం సాధారణ ప్రజల మధ్య పరుపుపైకి వెళ్లి కూర్చునేవారు. హుజూర్ (అ) ఆ సభకు వచ్చినప్పుడు, వారు సాధారణ ప్రజల వరుసలలో కూర్చునే వెనుక భాగానికి వెళ్లి అక్కడ కూర్చునేవారు. కొన్నిసార్లు వారి తాతగారు వారిని కూడ ముందుకు వచ్చి కూర్చోమని చెప్పేవారు. కానీ వారు మాత్రం "నేను ఇక్కడే చాలా సౌకర్యంగా ఉన్నాను" అని చెప్పేవారు.

(సీరతుల్ మహ్దీ, సంపుటి 1, కథనం 192, పుటలు 199-200)

వారికి ఎప్పుడూ ప్రముఖమైన స్థలంలో కూర్చోవాలనే కోరిక ఉండేది కాదు. వారు ఎల్లప్పుడూ సాధారణ ప్రజల మధ్యే కూర్చునేవారు. ఇంతకు ముందు వారు (అ) ఇచ్చిన ఉపదేశం ప్రకారం, ఆతిథేయుడే మీరు ఎక్కడ కూర్చోవాలో నిర్ణయిస్తాడు. వారు (అ)తన జీవితమంతా అదే సూత్రాన్ని ఆచరించారు.

అదేవిధంగా, హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) మరో కథనాన్ని ఇలా వివరించారు: ఖాజీ అమీర్ హుసైన్ సాహిబ్ తనతో ఇలా చెప్పారు. ఒకసారి మేము హుజూర్ (అ)ను ఇలా అడిగాము: "హుజూర్, హదీసులో ప్రవక్తలందరూ మేకలను మేపారని పేర్కొనబడింది. హుజూర్, మీరు కూడా ఎప్పుడైనా మేకలను మేపారా?" హుజూర్ (అ) సమాధానమిచ్చారు: "అవును. ఒకసారి నేను పొలాల వైపు వెళ్లాను. అక్కడ ఒక వ్యక్తి తన మేకలను మేపుతున్నాడు. అతడు, 'నాకు ఒక చిన్న పని ఉంది. దయచేసి నా మేకలను చూసుకోండి' అని చెప్పాడు. అయితే అతడు వెళ్లిపోయి, సాయంత్రం వరకు తిరిగి రాలేదు. అతడు తిరిగి వచ్చే వరకు నేను అతని మేకలను మేపాల్సి వచ్చింది."

(సీరతుల్ మహ్దీ, సంపుటి 1, కథనం 108, పుట 88)

రోజు మొత్తం మేకలను మేపుతూ గడిపారు. నిజానికి హుజూర్ (అ) ఆ ప్రాంతపు ప్రధాన నాయకుని కుమారుడు, ఒక గౌరవప్రదమైన స్థానం కలిగినవారు. అయినా, ఆ పని చేయడంలో వారికి ఎటువంటి సంకోచం లేదా అవమాన భావన కలగలేదు. సాయంత్రం వరకు, ఆ వ్యక్తి యొక్క మేకలను, అతడు కౌలు రైతు అయినా లేదా తన వద్ద పనిచేసే కూలీ అయినా, హుజూర్ (అ) వినయంతో మేపుతూ కొనసాగించారు.

అదే విషయానికి సంబంధించి, హుజూర్ (అ) వ్యక్తిగత వినయశీలత గురించి మాట్లాడుతూ, అల్ ఫజల్ కార్యాలయ సిబ్బంది సభ్యుడైన హజ్రత్ ఖ్వాజా అబ్దుర్ రహ్మాన్ సాహిబ్ ఇలా తెలిపారు: "నేను హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) వారి ఇంటి తలుపు వద్ద ద్వారపాలకునిగా సేవ చేసేవాడిని. బయట కూర్చొని కాపలా కాస్తూ, వచ్చేవారికి, వెళ్లేవారికి సందేశాలు తీసుకెళ్లడం, వారికి అందజేయడం లేదా అవసరమైన ఏ పనినైనా చూసుకోవడం చేసేవాడిని. నేను వారి తలుపు వద్ద బయట కూర్చునేవాడిని. అంతేకాక, హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) వారి ఇంటిలో కూడా చాలాసేపు ఉండేవాడిని, లోపలికి కూడా వెళ్లేవాడిని. ఆ మొత్తం కాలంలో హజ్రత్ సాహిబ్ (అ) 'జీ' అనే గౌరవసూచక పదం తప్ప మరే ఇతర పదాన్ని ఉపయోగించడం నేను వినలేదు. హుజూర్ (అ) నాతో మాట్లాడిన ప్రతిసారీ 'జీ' అని సంబోధించేవారు. మాట్లాడేటప్పుడు ఆ పదాన్ని ఉపయోగించకుండా ఎప్పుడూ ఉండే వారు కాదు. వారిలో ఎటువంటి అహంకారాన్ని లేదా గర్వాన్ని నేను ఎన్నడూ చూడలేదు. వారు ఎల్లప్పుడూ ఎంతో మృదుత్వంతో మాట్లాడేవారు. వారి ముఖంపై ఎల్లప్పుడూ సంతోషం, ప్రసన్నత కనిపించేది. వారు కోపంగా ముఖం చిట్లించడం గానీ, కనుబొమ్మలు ముడుచుకోవడం గానీ నేను ఒక్కసారి కూడా చూడలేదు. వారి నుదుటిపై ముడత పడటం కూడా నేను ఎప్పుడూ చూడలేదు. అలాగే, హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) ఎవరిని కూడ ఓ ... లేదా నివ్వు అని పిలిచేవారు కాదు. వారు (అ) అలాంటి పదాలను ఎప్పుడూ ఉచ్చరించేవారు కాదు. వారు (అ) ప్రజలందరినీ ఎల్లప్పుడూ గౌరవంతోనే చూసేవారు."

(రివాయత్ అస్హాబ్-ఎ-అహ్మద్, సంపుటి 2, పుటలు 294-295)

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఇలా రాసారు. డాక్టర్ మిర్ ముహమ్మద్ ఇస్మాయిల్ సాహిబ్ (రజి) తనతో ఇలా చెప్పారు.

"హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) ఇంటి పనులు చేయడానికి ఎప్పుడూ వెనుకాడే వారు కాదు. స్వయంగా మంచాలు పరిచేవారు, స్వయంగా నేలను ఊడ్చేవారు, తుడవడం మొదలైన పనులను కూడా స్వయంగా చేసేవారు. మంచాలను సర్దేవారు, చీపురుతో ఊడ్చేవారు. రాత్రివేళ అకస్మాత్తుగా వర్షం పడితే, చిన్న పిల్లలు తమ మంచాలపై నిద్రపోతూనే ఉండేవారు. అప్పుడు హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) ఒక వైపు మంచాన్ని పట్టుకునేవారు, మరొకరు మరో వైపు పట్టుకునేవారు; ఇద్దరూ కలిసి ఆ మంచాలను లోపలికి, వరండాలోకి తీసుకువచ్చేవారు."

ఆ రోజుల్లో ఎయిర్ కండిషనర్లు గానీ, ఫ్యాన్లు గానీ ఉండేవి కావు. వేసవి కాలంలో ప్రజలు ఇంటి ఆవరణలో బయట నిద్రించేవారు. రాత్రివేళ తుఫాను వచ్చినా లేదా వర్షం పడినా, మంచాలను ఎత్తి వరండాలోకి తీసుకురావాల్సి వచ్చేది. అందువల్ల పిల్లల మంచాలను లోపలికి తీసుకురావడంలో హుజూర్ (అ) కూడా సహాయం చేసేవారు. అటువంటి సందర్భంలోనైనా, లేదా ఉదయం సమయంలోనైనా, ఎవరైనా పిల్లలను అకస్మాత్తుగా కుదిపి నిద్రలేపాలని ప్రయత్నిస్తే, హుజూర్(అ) వారిని అడ్డుకుని ఇలా చెప్పేవారు: 'పిల్లవాడిని అకస్మాత్తుగా కుదిపి, గట్టిగా అరవడం వల్ల అతను ఉలిక్కిపడి భయపడతాడు. మృదువుగా పిలుస్తూ సున్నితంగా నిద్రలేపాలి."

(సీరత్-ఉల్-మహ్దీ, సంపుటి 1, కథనము 559, పుట 543)

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి ) మరో కథనాన్ని ఇలా వివరించారు: "మిర్జా సుల్తాన్ అహ్మద్ సాహిబ్, మౌల్వీ రహీమ్ బఖ్ష్ సాహిబ్ వద్ద నుండి ఈ సంఘటనను విని, నాకు ఇలా చెప్పారు: తన తండ్రి హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) ఇంటి పైభాగంలోని అత్యంత ఎత్తైన అంతస్తులో బయట ఉండేవారని, వారికి ఆహారం కూడా ఇంటి వెలుపలి భాగానికి అక్కడికే పంపించబడేదని. పంపబడిన ఆహారం ఏదైనా సరే, హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) దానినే తినేవారు."

(సీరత్-ఉల్-మహ్దీ, సంపుటి 1, కథనము 189, పుట 199)

హజ్రత్ మిర్జా సుల్తాన్ అహ్మద్ సాహిబ్ ఇలా తెలిపారు: తన తండ్రి హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) ఇంటి పై అంతస్తులోని వెలుపలి భాగంలో ఉండే వారు. ఇంటి రెండవ అంతస్తులో బయట ఒక గది నిర్మించబడి ఉండేది. హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) అక్కడే నివసించేవారు. హుజూర్(అ)కు ఆహారం కూడా అక్కడికే తీసుకువచ్చేవారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) ఉపవాసం ఉన్న సమయాల్లో కూడా ఆహారం వారి (అ) వద్దకు పంపబడేది. అప్పుడు వారు ఆ ఆహారాన్ని పేదలకు పంచిపెట్టేవారు. వారి కోసం ఆహారం అక్కడికి తీసుకెళ్లబడేది. ఏ ఆహారం పంపినా, అది ఏదైనా సరే, హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) ఎలాంటి వ్యాఖ్య చేయకుండా, ఫిర్యాదు చేయకుండా దానిని స్వీకరించి తినేవారు.

జమాఅత్ చరిత్రలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఒక సంఘటన హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) తన వాగ్దానం ప్రకటించడానికి పూర్వం జరిగినది. మౌల్వీ మహమ్మద్ హుసైన్ బటాల్వీ సాహిబ్ ఢిల్లీ నుండి కొత్తగా అర్హత పొందిన మౌల్వీ మరియు పండితునిగా బటాలాకు తిరిగి వచ్చినప్పుడు, ఆ ప్రాంతమంతటా ఆయనకు గొప్ప పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ఆ రోజుల్లో వివిధ మతపరమైన, న్యాయపరమైన విషయాలపై ముకల్లిదీన్ అంటే హనఫీలు, మాలికీలు తదితరుల వలె ఒక నిర్దిష్ట ఫిఖ్ ఇమామ్‌ను అనుసరించే వారు మరియు నాన్-ముకల్లిదీన్ అంటే అహ్లే హదీస్ తదితరుల వలె నిర్దిష్ట ఫిఖ్ ఇమామ్‌ను అనుసరించని వారి మధ్య పాండిత్యపూర్వక చర్చలు, వాదోపవాదాలు సాధారణంగా జరిగేవి. ఈ వాదోపవాదాల వల్ల బటాలా ప్రజల్లో ఏర్పడిన హడావుడి, కలకలాన్ని చూసినప్పుడు, వారి దృష్టి హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ) వైపు మళ్లింది. కావున హుజూర్ (అ)ను ముందుకు తీసుకువచ్చి ఈ మౌల్వీకి ఎదురుగా నిలబెట్టాలని వారు భావించారు. ఈ యువ మౌల్వీని మౌనం చేయగలిగేది హుజూర్ (అ)మాత్రమే అని వారు పూర్తిగా నమ్మారు. మొత్తానికి హజ్రత్ మసీహ్ మౌఊద్ (అ)ను ఈ వాదోపవాదంలో పాల్గొనడానికి ఒప్పించడం చాలా కష్టమైంది. మొదట్లో వారికి ఇందులో పాల్గొనాలనే ఆసక్తి లేదు. అయితే ప్రజలు ఎంతో పట్టుబట్టడంతో, చివరకు వారు (అ) అంగీకరించారు. ఈ విధంగా హుజూర్ (అ)ను వాదోపవాదానికి ముందుకు తీసుకువచ్చారు. రెండు వర్గాల నుంచి గణనీయమైన సంఖ్యలో మద్దతుదారులు అక్కడికి చేరుకున్నారు. ఇరు పక్షాలకు చెందిన మద్దతుదారులు తమ తమ వర్గాలతో కలిసి నిలబడ్డారు. ఆ రోజు ముకల్లిదీన్ తమకు ఎదురుచూస్తున్న విజయంపై ప్రత్యేకమైన విశ్వాసంతో ఉన్నారని, అది సహజమేనని వ్రాయబడింది. ఎందుకంటే, వారు ఈ వాదప్రతివాదం కోసం ఒక ప్రతిష్ఠాత్మకమైన పండితుడిని నియమించారు. ఖాదియాన్‌కు చెందిన హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌఊద్ (అ) గారు ముందుకు

**అహ్‌దీస్ బోధనలు**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."**

(కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671)

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

**అహ్‌దీస్ బోధనలు**

**"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.**

(మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

**దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb***

వచ్చారు కాబట్టి ఇప్పుడు విజయం ఖాయమని వారు భావించారు. వాద ప్రతివాదాలలో వారికి ఉన్న ప్రావీణ్యం అలాంటిది. వారి (అ) ప్రత్యర్థి ఉచ్చులో చిక్కుకున్న పక్షిలా పూర్తిగా నిస్సహాయుడిగా, శక్తిహీనుడిగా మారిపోతాడని వారు నమ్మారు.

మొత్తానికి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వాదప్రతివాదం జరిగే ప్రదేశానికి చేరుకున్నప్పుడు, మౌల్వీ ముహమ్మద్ హుసైన్ బటాల్వీ సాహిబ్‌ను తన అభిప్రాయాలు, ఆలోచనలు మరియు విశ్వాసాలను వివరించమని కోరారు, తద్వారా వాటిని ఖండించవచ్చని భావించారు. మౌల్వీ ముహమ్మద్ హుసైన్ బటాల్వీ సాహిబ్ ఇలా సమాధానమిచ్చారు: "నా విశ్వాసం ఏమిటంటే, పవిత్ర ఖుర్ఆన్‌కు ప్రాధాన్యత ఉంది. ఆ తరువాత హదీసులు మరియు దైవ ప్రవక్త (స) వారి వచనాలు వస్తాయి. తీర్పు కూడా వీటికి అనుగుణంగానే ఇవ్వబడుతుంది." మౌల్వీ సాహిబ్ అభిప్రాయాన్ని విన్న హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా అన్నారు: "నా దృష్టిలో, మీ విశ్వాసాలలో గానీ, మీ అభిప్రాయాలలో గానీ అభ్యంతరకరమైనది లేదా ఖండించాల్సినది ఏమీ లేదు." కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను ముందుకు తీసుకువచ్చిన వారు, దీనిని తమ ఓటమిగా పరిగణిస్తారని, ప్రత్యర్థి వర్గం విజయభేరి మోగిస్తుందని భావించారు. మౌల్వీ సాహిబ్ చెప్పిన విషయాలలో తనకు అభ్యంతరకరమైనదేమీ లేదని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) స్పష్టంగా చెప్పేశారు. ఏదేమైనా, ఏదో ఒక విధంగా మౌల్వీ సాహిబ్‌ను వాదప్రతివాదంలో ఇబ్బందికి గురిచేయాలని వారు కోరుకున్నారు. అయితే, విజయ గర్వం పట్లగానీ, ఓటమి అవమానం పట్లగానీ ఏమాత్రం పట్టించుకోకుండా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అత్యంత వినయాన్ని, నమ్రతను ప్రదర్శించి వాదప్రతివాదం నుంచి తిరిగి వచ్చారు.

ఈ సంఘటనను ప్రస్తావిస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా వ్రాశారు: "1868 లేదా 1869లో నాపై ఉర్దూ భాషలో ఒక అద్భుతమైన దైవవాణి అవతరించింది. దానిని ఇక్కడ ప్రస్తావించడం సముచితంగా అనిపిస్తోంది. ఈ దైవవాణికి సంబంధించిన పరిస్థితులు ఈ విధంగా ఏర్పడ్డాయి. ఒకప్పుడు నాకు సహాధ్యాయిగా ఉన్న బటాలాకు చెందిన మౌల్వీ అబూ సయీద్ ముహమ్మద్ హుసైన్, తన మతపరమైన విద్యను పూర్తిచేసుకుని బటాలకు తిరిగి వచ్చారు. ఆయనలోని కొన్ని అభిప్రాయాలు, ఆలోచనల కారణంగా బటాలా ప్రజలు ఆయనను అనుమానంతో చూశారు. ఒక వ్యక్తి, మౌల్వీ ముహమ్మద్ హుసైన్‌తో ఒక వివాదాస్పద అంశంపై ఈ భవదీయుడు వాదప్రతివాదం చేయాలని చాలా పట్టుబట్టాడు. అతని పట్టుదలకు అంగీకరించి, సాయంత్రం అతనితో కలిసి మౌల్వీ ముహమ్మద్ హుసైన్ ఇంటికి వెళ్లాను. అక్కడ ఆయన తన తండ్రితో కలిసి మసీదులో ఉన్నారు. క్లుప్తంగా చెప్పాలంటే, గౌరవనీయ మౌల్వీ ముహమ్మద్ హుసైన్ వివరణను విన్న తరువాత, ఆయన మాటల్లో అన్యాయమైనదీ, అభ్యంతరకరమైనదీ ఏమీ లేదని ఈ భవదీయుడు గ్రహించాడు. అందువల్ల, అల్లాహ్ కోసం ఆయనతో జరపవలసిన వాదప్రతివాదాన్ని విరమించుకున్నాను. ఆ రాత్రి, దయామయుడైన అల్లాహ్ తన దైవవాణి మరియు సంభాషణ ద్వారా, అదే వాదప్రతివాదాన్ని విరమించుకోవడాన్ని సూచిస్తూ నాతో ఇలా అన్నాడు: 'నీవు చేసిన పనికి నీ దేవుడు ఎంతో సంతోషించాడు. అతడు నీకు చాలా శుభములను అనుగ్రహించును. ఎంతగా అంటే, రాజులు నీ వస్త్రాల నుండి శుభములను పొందాలని కోరుకుంటారు.' ఆ తరువాత, గుర్రాలపై స్వారీ చేస్తున్న ఆ రాజులు నాకు ఒక దర్శన స్థితిలో చూపించబడ్డారు. ఈ వినయం మరియు అణకువ పూర్తిగా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కోసం అవలంబించబడినందున, పరిపూర్ణమైన ఉపకారకుడైన అల్లాహ్ దానిని ప్రతిఫలం లేకుండా వదిలివేయాలని కోరలేదు." **(బరాహీన్-ఎ-అహ్మదీయా, భాగం 4, రూహానీ ఖజాయిన్, సంపుటి 1, పుటలు 621-622, అనుబంధానికి అనుబంధం గమనిక సంఖ్య 3)**

హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ సాహిబ్ (రజి) తన హయాత్-ఎ-అహ్మద్ గ్రంథంలో ఈ సంఘటనను నమోదు చేసి, దానికి ఒక వ్యాఖ్యను కూడా జోడించారు. వారు ఇలా వ్రాశారు:

"ప్రజలకు సాధారణంగా జరిగే బహిరంగ వాదప్రతివాదాల తీరు, వాటిలో పాల్గొనే వారి పరిస్థితి బాగా తెలుసు. ఒక వాదప్రతివాది తన ప్రత్యర్థి లేదా పోటీదారు చెప్పిన సత్యమైన మాటను బహిరంగంగా అంగీకరించడం ఎంతటి కష్టమో వారికి తెలుసు. పండితులను కించపరచడం నా ఉద్దేశం కాదు. అయితే చాలా మంది పండితులకు తమ స్వంత తప్పును అంగీకరించడం కంటే ప్రాణాలు విడిచి పెట్టడం సులభంగా అనిపిస్తుంది. మరొక పక్షం చెప్పిన సరైన మరియు సహేతుకమైన మాటను అంగీకరించడం గురించి చెప్పనవసరం లేదు. (ఇదే విషయం నేటికీ వర్తిస్తుంది.) అయితే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) స్వభావం నిజాయితీతోను, అల్లాహ్ ప్రసన్నతను కోరుకోవడంతోను నిండి ఉంది. స్వభావరీత్యా, ముస్లింలు అంతర్గత కలహాలు మరియు పరస్పర విభేదాలలో నిమగ్నమై ఉండటాన్ని వారు (అ) ఇష్టపడరని కూడా స్పష్టమవుతుంది. అభిప్రాయ భేదాల కారణంగా వారు సత్యాన్వేషణను మరియు సత్యాన్ని పలకడాన్ని విడిచిపెట్టాలని కూడా వారు (అ) కోరుకోలేదు. వారి (అ) ధైర్యం మరియు నైతిక సాహసం ఎంతో గొప్పవి. ఒక వ్యక్తితో వాదప్రతివాదం చేయడానికి వారు వెళ్లారు; అతని ఇంటికి చేరుకున్నప్పుడు, ఆ వ్యక్తి జ్ఞానం లేదా ప్రభావం చూసి వారి(అ)లో ఏమాత్రం సంకోచం లేదా భయం కలగలేదు. అయితే, ఆ వ్యక్తి ఒక సత్యమైన మాట పలికినప్పుడు, ప్రజలు ఏమనుకుంటారో, తాను వెనక్కి తగ్గినట్లు భావిస్తారా, లేక ప్రత్యర్థి ముందు భయపడి పోయినట్లు భావిస్తారా? అనే విషయాలను వారు (అ) ఏమాత్రం పట్టించుకోలేదు. ఆ మాట సత్యానికి అనుగుణంగా ఉన్నందువల్ల మాత్రమే వారు (అ) దానిని అంగీకరించారు. ప్రజలు ఏమంటారనే ఆందోళన లేకుండా, సత్యమైన విషయాన్ని వారు (అ0 అంగీకరించారు. ఆ మాట యొక్క సత్యతను అంగీకరించడం ద్వారా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఆ మాటను బలపర్చినట్లుగా భావించబడుతుంది."

ఇటువంటి కార్యాలకు ఉదాహరణలు ప్రవక్తల (అ) మరియు వారి నిజమైన అనుచరుల జీవితాల్లో తప్ప మరెక్కడా కనిపించవు. మతంలో నిజాయితీ, అలాగే స్వీయ అహంకారాన్ని మరియు కోరికలను అణచివేయాలనే శక్తివంతమైన ప్రేరణ అల్లాహ్ కృప ద్వారానే ప్రసాదించబడుతుంది. ఈ కార్యాన్ని అల్లాహ్ ఆమోదించిన సంకేతాలు అదే సమయంలో ప్రత్యక్షమయ్యాయి. ఎందుకంటే అల్లాహ్ తన దివ్యవాణి ద్వారా శుభవార్తను అందించి, ఒక విధంగా 'అల్లాహ్ వారి (అ) పట్ల సంతుష్టుడయ్యాడు' అనే ధృవపత్రాన్ని ప్రసాదించాడు. "ఈ లోకంలో మనిషి మరింతగా ప్రజల ఆమోదాన్ని పొందాలని, ప్రజలు తనవైపు ఆకర్షితులవ్వాలని కోరుకుంటాడు. అయితే, ఈ కార్యానికి ఫలితంగా రాజులు వారి వస్త్రాల ద్వారా శుభములు పొందడానికి ప్రయత్నిస్తారని అల్లాహ్ ప్రకటించాడు. ఆ సమయంలో బరాహీన్-ఎ-అహ్మదియ్యా రచన, క్రమబద్ధీకరణ గురించి ఆలోచన కూడా ఇంకా వారి (అ) మనసులో కలగలేదు; ఇక వారు (అ) తన దావాను ప్రకటించే స్థాయికి చేరుకోవడం గురించి చెప్పనవసరం లేదు. వారు (అ) ఈ లోకంలో ఎవరికీ పెద్దగా తెలియని, నిరాడంబరమైన జీవితం గడుపుతున్నారు. వారు (అ) అప్పటికే తన ఉద్యోగాన్ని విడిచిపెట్టారు. భవిష్యత్తులో జీవితం ఎలా సాగుతుందనే ఆలోచనలు వారి స్వంత హృదయాన్ని, మనసును కలవరపెట్టకపోయినా, కుటుంబ సభ్యులు మాత్రం వారు(అ) ఇక ఏమి చేస్తారో అని తప్పకుండా ఆలోచిస్తూ ఉండేవారు. అలాంటి సమయంలోనే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)కు రాజులు వారి (అ) వస్త్రాల ద్వారా శుభములు పొందుతారని తెలిపే దివ్యవాణి అవతరించింది. (ఆ సమయంలో వారి వద్ద అసలు ఏమీ లేదు; వారి గౌరవనీయ తండ్రి కూడా అప్పటికీ జీవించి ఉన్నారు.) "సంక్షిప్తంగా చెప్పాలంటే, వారు (అ) జీవితంలో ఒక దశలో ఉన్నారు. ఒక ప్రాపంచిక వ్యక్తి గొప్ప ఆశలు పెట్టుకునే దశ, అలాగే అన్ని రకాల ఆశయాలు, ఆత్మాభిమానం, తనను తాను ప్రదర్శించుకోవాలనే కోరికలు అత్యున్నత స్థాయిలో ఉండే వయస్సు. ప్రతి వ్యక్తి తన అభిప్రాయాన్ని సమర్థించు కోవడంలో తరచుగా పట్టుదలగా, మొండిగా ఉంటాడు. అయినప్పటికీ, ఈ పరిస్థితు లన్నింటి మధ్య మిర్జా సాహిబ్ ఒక ప్రసిద్ధ మౌల్వీతో వాదోపవాదానికి వెళ్లారు. వారు (అ) అతని ప్రసంగాన్ని శ్రద్ధగా విని, అది సరైనదని భావించి, దానిని సమర్థించారు. "ప్రజలు ఏమంటారో అని వారు (అ) పట్టించుకోలేదు. అలాగే, ఆ వ్యక్తి తన కొన్ని విశ్వాసాల కారణంగా అప్పటికే విస్తృతంగా వ్యతిరేకించ బడుతున్నాడనే విషయాన్ని కూడా వారు (అ) లెక్కచేయలేదు. అంతేకాక, తన స్వీయ ప్రకటన ద్వారా తాను వాస్తవానికి అతనికి మద్దతు ఇస్తున్నట్లు భావించబడతాననే విషయమూ కూడ వారిని ఆందోళనకు గురిచేయలేదు. తనపై కూడా దూషణల తుఫాను చెలరేగవచ్చనే భయం వారికి లేదు. కాబట్టి, ఆ పరిస్థితులను ఆలోచించండి: హనఫీలు మరియు గైర్-ముకల్లిద్‌ల మధ్య తీవ్రమైన పోరాటం జరుగుతున్న సమయంలో, ఏ అహ్లే-హదీస్ పండితుడికైనా మద్దతు ఇవ్వడం అంటే తనపై లెక్కలేనన్ని ఇబ్బందులను ఆహ్వానించుకోవడమే. అయినప్పటికీ, మిర్జా సాహిబ్ మౌల్వీ ముహమ్మద్ హుసైన్ సాహిబ్‌కు మద్దతు ఇచ్చారు, అదే సమయంలో ఆయనకు వ్యతిరేకంగా వాదించడానికి మిర్జా సాహిబ్‌ను నియమించారు. "మౌల్వీ అబూ సయీద్ సాహిబ్ విజ్ఞానం లేదా పాండిత్యం వల్ల హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ.) మౌనమయ్యారని భావించడం పూర్తిగా మూర్ఖత్వం. తరువాత జరిగిన సంఘటనల్లో మౌల్వీ ముహమ్మద్ హుసైన్ సాహిబ్‌తో ప్రత్యక్షంగా మాటల మరియు లిఖిత పూర్వక వాదోపవాదాలు జరగకపోయి ఉంటే, అలాగే ఈ మహోన్నత ముహమ్మద్ సేవకుడు

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | "అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్లె ఆందోళన కూడ దూరం కాదు. " (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*



(అ) అత్యంత తీవ్రమైన పోటీలో ఆ మౌల్వీని ఎదుర్కొనేందుకు ముందుకు రాకపోయి ఉంటే, అలాంటి అభిప్రాయానికి కొంతైనా ఆధారం ఉండేదేమో. "ఆ సందర్భంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఆయన ప్రభావానికి లోనయ్యారని అనుకోవడం సాధ్యం కాదు. ఎందుకంటే తరువాతి సంఘటనలు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మౌల్వీ ముహమ్మద్ హుసైన్ సాహిబ్‌ను అనేకసార్లు సవాలు చేశారని, ఆయన ఏ తప్పు చేస్తున్నారో, ఏ మంచి పని చేస్తున్నారో స్పష్టంగా తెలియజేశారని నిరూపిస్తున్నాయి." షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ సాహిబ్ (రజి) మరల ఇలా వ్రాసారు: "ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆ మౌల్వీ యొక్క పాండిత్యం లేదా ప్రభావం హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)లో కనీసం ఒక్క క్షణం కూడా భయాన్ని కలిగించలేదు. ఇవి చారిత్రక వాస్తవాలు, వీటిని ఎవరూ తిరస్కరించలేరు. కాబట్టి, అలాంటి ఆలోచనను కలిగి ఉండటం పూర్తిగా అజ్ఞానం. ఈ సంఘటన వెనుక ఉన్న ఏకైక వాస్తవం హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి విశ్వాసపూర్వక నిజాయితీ."

(హయాత్-ఎ-అహ్మద్, సంపుటి 1, పుటలు 291-292)

ధార్మిక వ్యవహారాలలోని స్వచ్ఛత ఇది. అందుకే ఆ సందర్భంలో హుజూర్ (అ) ఆ విషయాన్ని స్వీకరించారు. అంతేగాని మౌల్వీ ముహమ్మద్ హుసైన్ బటాల్వీకి భయపడి చేసినది కాదు. ఎందుకనగా తరువాత హుజూర్ (అ) అతనికి అనేకసార్లు సవాలు చేశారు, పదేపదే సంభాషణకు ఆహ్వానించారు, సత్యమార్గంలోకి రావాలని ఆయనను ప్రోత్సహించారు.

ఒక సందర్భంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మౌల్వీ ముహమ్మద్ హుసైన్ బటాల్వీ సాహిబ్‌కు ఒక లేఖ రాశారు. అందులో ఆయనకు సత్య సందేశాన్ని తెలియజేశారు. అయితే, అల్లాహ్ చేత నియమించబడిన మహోన్నత స్థితిలో ఉన్నప్పటికీ, తన గురించి అత్యంత వినయంతో మరియు నమ్రతతో మాట్లాడారు. వారు (అ) ఇలా వ్రాశారు:

"నా గౌరవనీయ మరియు ప్రియమైన సోదరుడు, మౌల్వీ సాహిబ్, అల్లాహ్ మిమ్మల్ని కాపాడుగాక!...మీ లేఖ అందింది. (ప్రారంభంలో సలాం కూడా వ్రాశారు.) ఈ భవదీయుడికి అత్యంత కష్టమైన విషయం ఏమిటంటే, నా ఆరోగ్యం తరచుగా అకస్మాత్తుగా బాగా క్షీణిస్తుంది, మరణం నా కళ్లముందే ఉన్నట్లు అనిపిస్తుంది. అంతేకాకుండా, రాత్రింబవళ్లు ఏదో ఒక విధమైన అనారోగ్యం నన్ను వెంటాడుతూనే ఉంటుంది. ఎక్కువసేపు సంభాషణలో పాల్గొంటే అనారోగ్యం మొదలవుతుంది; లోతైన ఆలోచనలో ఎక్కువగా నిమగ్నమైతే కూడా అదే పరిస్థితి ఏర్పడుతుంది. "మీ చివరి లేఖ వచ్చినప్పుడు, అది మౌల్వీ అబ్దుల్ జబ్బార్ సాహిబ్‌తో కలిసి వ్రాసినట్లుగా అనిపించింది. అంటే, మీ ఇద్దరూ కలిసి దానిని వ్రాసినట్లు కనిపించింది. అందువల్ల దానికి కూడా అదే విధంగా సమాధానం సిద్ధం చేయబడింది. "ఈ భవదీయుడు తీవ్రమైన అనారోగ్యం కారణంగా దాదాపు పూర్తిగా బలహీనుడై పోయాడు. (ఆ సమయంలో వారు చాలా అనారోగ్యంతో ఉన్నారు.) మాటలతో గానీ, వ్రాతపూర్వకంగా గానీ వాదప్రతివాదాలలో పాల్గొనే శక్తి నాలో ఎక్కడ ఉంది?. (ఆ సమయంలో వాదప్రతివాదాలకు పాల్పడేంత శక్తి వారికి లేదు.) "ఈ మూడు గ్రంథాలు ఫతహ్ ఇస్లాం, తౌజిహె మరామ్, ఇజాలా-ఎ-ఔహామ్ వ్రాయబడటం కేవలం అల్లాహ్ కృప వల్లనే జరిగింది. ఇవి కూడా ఎక్కువ సందర్భాల్లో ఈ భవదీయుడు చెప్పిన మాటలను మరొక వ్యక్తి వ్రాసే విధంగానే రచించబడ్డాయి; నేను స్వయంగా నా చేతితో ఏదైనా వ్రాసిన సందర్భాలు చాలా అరుదు. వ్రాసిన పదాలను సక్రమంగా సరిచేసి, మెరుగుపరచగల సామర్థ్యం కూడా నాకు లేదు. "మీకు హదీస్ జ్ఞానం ఎంతో విస్తృతంగా ఉంది ( మౌల్వీ సాహిబ్‌ను ఉద్దేశించి ఇలా చెబుతున్నారు. ఈ గ్రంథాలను తాను వ్రాసినప్పటికీ, మౌల్వీ సాహిబ్ గొప్ప హదీస్ పండితుడు). అయితే ఈ భవదీయుడు నిరక్షరాస్యుడు, అజ్ఞాని. నాకు ఆరాధనగానీ, ఆధ్యాత్మిక సాధనలుగానీ లేవు (హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తమ వినయాన్ని వ్యక్తం చేస్తున్నారు) జ్ఞానముగానీ, ఏ విధమైన సామర్థ్యముగానీ లేదు. సంక్షిప్తంగా చెప్పాలంటే, నా వద్ద ఏమీ లేదు. "అయితే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి ఒక ఆజ్ఞ వచ్చింది. అది స్పష్టమైనది, నిశ్చయాత్మకమైనది. అందువల్ల ఈ భవదీయుడు దానిని తెలియజేశాడు. దానిని ఎవరైనా అంగీకరించాలా వద్దా అనేది వారి స్వంత నిర్ణయం మరియు అవగాహనపై ఆధారపడి ఉంటుంది."

(మక్తూబాత్-ఎ-అహ్మద్, సంపుటి 1, లేఖ సంఖ్య 10, పేజీలు 319-320)

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారు ఈ సందేశాన్ని మౌల్వీ గారికి ఎంతో వినయంతో తెలియజేశారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారు హజ్రత్ మున్షీ అహ్మద్ జాన్ సాహిబ్ (రజి)కు వ్రాసిన మరొక ప్రచురిత లేఖ కూడా వారి వినయం మరియు నమ్రతను ఇదే విధంగా ప్రతిబింబిస్తుంది. వారు ఇలా వ్రాశారు:

"నా గౌరవనీయమైన మరియు ప్రియమైన మిత్రమా, మీ లేఖ నాకు అందింది. అల్లాహ్ తాలా ఈ అల్పుడైన సేవకునికి ఇంతటి నిష్కపటమైన, అంకితభావం గల మిత్రులను ప్రసాదించినందుకు ఆయన అనుగ్రహాలకు తగిన కృతజ్ఞతను నేను వ్యక్తపరచలేను. వారి ఉనికే ఈ భవదీయుడి గౌరవం మరియు గర్వానికి కారణం. అల్లాహ్ కరుణామయుడు మిమ్మల్ని సంతోషంగా, సుసంపన్నంగా ఉంచి, ఈ విషయంపై మీరు హృదయపూర్వకంగా చూపుతున్న శ్రద్ధకు మీకు ప్రతిఫలం ప్రసాదించుగాక!. "ఈ భవదీయుడు పూర్తిగా అసమర్థుడు, అల్పుడు. నా వైపు నుండి ఎలాంటి అర్హతగానీ, హక్కుగానీ లేకపోయినప్పటికీ, అత్యంత కరుణామయుడైన అల్లాహ్ తన కృప మరియు దయతో ఈ అనర్హునిపై అపారమైన అనుగ్రహాలను నిరంతరం కురిపిస్తున్నాడు. (ఆయన గొప్ప అనుగ్రహాలను ప్రసాదిస్తున్నాడు.) ఆయన నాలో ఒక తప్పు తర్వాత మరొక తప్పును చూసినా, దయపై దయను ప్రసాదిస్తూనే ఉన్నాడు. తప్పుపై తప్పును చూసినా, ఆశీర్వాదంపై ఆశీర్వాదాన్ని అందిస్తూనే ఉన్నాడు. నిజంగా, ఆయన అత్యంత కరుణామయుడు, అత్యంత ఉదారుడు.'ఆయన అనుగ్రహాలకు కృతజ్ఞతలు చెప్పడానికి కావలసిన మాటలను నేను ఎక్కడి నుండి పొందగలను? ఈ అశక్తుడు ఏమీ కానివాడు, అల్పుడు, నిస్సహాయుడు, పూర్తిగా నిరుపేద. ఆయన నన్ను ధూళిలో పడి ఉన్నవానిగా చూసి, నన్ను ఉన్నత స్థితికి చేర్చాడు. (అంటే, అల్లాహ్ సర్వశక్తిమంతుడు ఈ అశక్తుడిని ధూళిలో ఉన్నవానివలె కనుగొని, అతని స్థాయిని ఉన్నతపరిచాడు.) నన్ను పూర్తిగా అనర్హుడిగా చూసినప్పటికీ, నా లోపాలను కప్పిపుచ్చాడు. నా బలహీనతను చూసి నాకు బలాన్ని ప్రసాదించాడు; నా అజ్ఞానాన్ని చూసి నాకు జ్ఞానాన్ని అనుగ్రహించాడు. (వారికి ఉన్న సమస్త జ్ఞానం అల్లాహ్ ప్రసాదమే.) "ఆయన నాకు చూపిన అనేకానేక అనుగ్రహాలను లెక్కించడం అసాధ్యం. ఆయన కృపకు ఒక నిదర్శనం ఏమిటంటే, మీలాంటి గౌరవనీయులైన సోదరుల హృదయాలలో ఈ భవదీయుడిపై ప్రేమను ఆయన నాటాడు. తన నిరంతర అనుగ్రహం ద్వారా ఈ ప్రేమబంధాన్ని మరింత పెంచి, ఈ జమాఅత్‌తో అనుబంధం కలిగించిన వారందరిపై తన కృపను ప్రసాదిస్తాడని నా ఆశ."

(మక్తూబాత్-ఎ-అహ్మద్, సంపుటి 3, పేజీలు 25-26)

అనగా, ఆయన తన జమాఅత్‌లో చేరిన వారికి విజయాన్ని ప్రసాదిస్తాడు.

ఈ లేఖను ప్రచురించే సమయంలో హజ్రత్ షేఖ్ యాకూబ్ అలీ ఇర్ఫానీ సాహిబ్ (రజి) ఒక గమనికలో ఇలా వ్రాశారు:

"ఈ లేఖ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) హృదయాన్ని అల్లాహ్ ప్రేమ మరియు మహిమ ఎంత అసాధారణ స్థాయిలో ఆవరించి ఉన్నాయో స్పష్టంగా చూపిస్తుంది. అదే విధంగా, అత్యున్నత స్థాయి వినయం, సౌమ్యత మరియు అణకువను కూడా ఇది ప్రతిబింబిస్తుంది. వారిపై కురిపించబడిన దైవిక అనుగ్రహాలు మరియు ఆశీర్వాదాల పట్ల కృతజ్ఞతా భావం ప్రతి పంక్తిలోనూ వ్యక్తమవుతోంది."

(మక్తూబాత్-ఎ-అహ్మద్, సంపుటి 3, పుట 26)

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) యేసుక్రీస్తు (అ) పోలికలో తాను మసీహ్ అని తన వాగ్దానమును ప్రకటించినప్పుడు, మౌల్వీ ముహమ్మద్ హుసైన్ బటాల్వీ సాహిబ్ తీవ్రంగా వ్యతిరేకించడం ప్రారంభించారు. ఆయన హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) పట్ల కఠినమైన మరియు అమర్యాద కరమైన భాషను ఉపయోగిస్తూ లేఖలు రాయడం ప్రారంభించారు. అలాగే తన పత్రిక ఇషాఅతుస్సున్నహ్‌లో కూడా ఇదే విధమైన భాషను ఉపయోగించాడు. ఇది ఒక విపత్తు, కావున ఈ సమాజాన్ని మరియు దాని అనుచరులను తాను చెదరగొడతానని అన్నారు. అంతేకాక, గతంలో తానే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) స్థాయిని పెంచినట్లే, ఇప్పుడు వారి స్థాయిని తానే దిగజార్చుతానని కూడా పేర్కొన్నారు. తాను హుజూర్ (అ)ను ప్రశంసించడం వలనే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ప్రతిష్ఠ పెరిగిందని, నవూజుబిల్లాహ్ ఇప్పుడు వారి (అ) ప్రతిష్ఠను తానే తగ్గిస్తానని భావించారు.

(రిసాలా ఇషాఅతుస్సున్నహ్, 1890, నం. 1, సంపుటి 13, పుట 324)

బరాహీన్-ఎ-అహ్మదియ్యాపై తాను అనుకూలంగా రాసిన సమీక్షయే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ప్రతిష్ఠను పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషించిందని మౌల్వీ సాహిబ్ అభిప్రాయపడ్డారు. అయితే, ఆయన లేఖల్లో వ్యక్తమైన ఈ విషపూరిత

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)



Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

భాష మరియు గర్వభావానికి ప్రతిస్పందనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నిరంతరం అసాధారణమైన సహనం, ఓర్పు, వినయం మరియు సౌమ్యతను ప్రదర్శించారు. ఆ సహనం మరియు ఓర్పు యేసుక్రీస్తు (అ) ప్రదర్శించిన సహనం మరియు ఓర్పును కూడా మించిపోయింది.

మౌల్వీ సాహిబ్‌కు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) రాసిన క్రింది లేఖను ఇక్కడ అందిస్తున్నాము. మౌల్వీ సాహిబ్ యొక్క కఠినమైన భాష మరియు అహంకారం ఉన్నప్పటికీ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) హృదయం సానుభూతి, సద్భావన, వినయం మరియు కరుణతో నిండి ఉందేదని ఈ లేఖ స్పష్టంగా చూపిస్తుంది. అందువల్ల, మౌల్వీ సాహిబ్‌ను ఉద్దేశించి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా వ్రాశారు:

"మీ లేఖ నాకు అందింది. ఈ భవదీయుడిని తానే నియమించాడని కరుణామయుడైన దేవునికి పూర్తిగా తెలుసు. అయినప్పటికీ, సాధారణ ప్రజల్లో అశాంతి వ్యాపించే ప్రమాదం ఉన్న విషయాల విషయంలో, సంపూర్ణమైన, నిర్ణయాత్మకమైన మరియు నిశ్చయమైన రీతిలో ఏదైనా విషయాన్ని ఈ భవదీయుడికి ప్రత్యక్షంగా చెప్పబడనంత వరకు, నేను దానిని ఎన్నడూ నా నాలుకపైకి తీసుకురాను. అయితే, ఇందులో కరుణామయుడైన దేవుని ఏదో ఒక ఆంతర్యం ఉండి తీరాలి. మసీహ్ అవతరణకు సంబంధించిన విషయానికి వస్తే, ఇది ఇస్లాం యొక్క మూలసారం మరియు కేంద్రభూతమైన అంశంతో, అంటే విశ్వాసం యొక్క వాస్తవికత మరియు అసలు స్వరూపంతో ఎటువంటి సంబంధం లేని విషయం. దాని నిజమైన స్వభావం ఒక తోటి ముస్లింకు స్పష్టంగా తెలియజేయబడినప్పుడు, సోదరభావం కారణంగా అతని పట్ల సదభిప్రాయాన్ని కలిగి ఉండవలసిన సందర్భంలో, గౌరవనీయులైన మీరు మాత్రం దానికి వ్యతిరేకంగా వ్రాయడానికి ప్రేరేపించబడ్డారు. 'మొదటగా, యేసు మరణించారని నేను చెప్పినట్లయితే, ముస్లింలుగా మీరు నాకు మద్దతు ఇవ్వాలి. కానీ దానికి బదులుగా మీరు నాకు వ్యతిరేకంగా మాట్లాడడం ప్రారంభించారు.' మరల ఇలా పేర్కొన్నారు: 'గౌరవనీయులు నాకు వ్యతిరేకంగా వ్రాయడానికి ప్రేరేపించబడ్డారు. అయితే, ఇందులో మీ ఉద్దేశం మంచిదేనని నాకు తెలుసు. (బహుశా మీరు దీనిని నిజాయితీతోనే చేసి ఉండవచ్చు.) మీ తొందరపాటుపై నాకు కొంత ఫిర్యాదు ఉన్నప్పటికీ, మీ త్వరితగతిన వ్యవహరించడం వల్ల మీరు కొన్ని పదాలను ఉపయోగిస్తున్నారు. నేను ఈ విషయాన్ని మీతో ప్రత్యక్షంగా చెప్పినా, మీ పరోక్షంలో చెప్పినా, మీ ఉద్దేశాల పట్ల నేను సదభిప్రాయాన్నే కలిగి ఉంటాను. అయినప్పటికీ, నేను మీ గురించి మంచిగానే ఆలోచిస్తూనే ఉన్నాను. ప్రస్తుత కాలంలోని చాలా మంది పండితుల కంటే మిమ్మల్ని నేను ఉన్నతంగా భావిస్తున్నాను. మీరు అసంతృప్తి చెందకపోతే, అల్లాహ్ మార్గంలో నిజాయితీగా కృషి చేయడంలో మిమ్మల్ని మౌల్వీ నజీర్ హుసైన్ సాహిబ్ కంటే కూడా ఉత్తములుగా నేను భావిస్తున్నాను. ఈ విషయాల గురించి నేను మీకు ఫిర్యాదు చేసినప్పటికీ, మీ హృదయ పవిత్రత కారణంగా మీ పట్ల నాకు అత్యంత గౌరవం ఉంది."

"నన్ను గుర్తించకపోతే, ఇది నా కోసం విధించబడిన నిర్ణయమని నేను భావిస్తాను. నాకు విజయం లేదా ఓటమి గురించి ఎలాంటి ఆందోళన లేదు; నా ఆందోళన ఆజ్ఞను పాటించడం, విధేయత చూపడమే. (నేను గెలుస్తానా లేదా అన్నది కాదు, ఆజ్ఞను పాటించడమే నా ఉద్దేశం.) సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నాకు ఇది చేయమని ఆజ్ఞాపించాడు. ఆయనకు విధేయతతోనే నేను ఇలా చేస్తున్నాను. నేను నా వాదనను సమర్పించాను. ఈ విభేదం మంచి ఉద్దేశంతోనే జరుగుతుందని నాకు తెలుసు. అయితే, నా అభిప్రాయం ప్రకారం, మీరు ముందుగా నాతో సంభాషించి, నా పుస్తకాలు 'రిసాలహ్ సలాసా', అనగా 'ఫతహ్‌యే-ఇస్లాం', 'తౌజీహ్-ఏ-మరామ్', 'ఇజాలా-ఏ-ఔహామ్' వాటిని పరిశీలించి, ఆ తర్వాత ఏదైనా రాస్తే మంచిది. "మీ వంటి మిత్రులు వ్యతిరేక అభిప్రాయానికి మొగ్గుచూపుతున్నారని నాకు ఎలాంటి బాధ లేదా విచారం లేదు. ఎందుకంటే ఈ అభిప్రాయ భేదం కూడా సత్యాన్వేషణ కోసమే. బహుశా మీరు సత్యాన్ని అన్వేషిస్తూ ఉండవచ్చు. అయితే ముందుగా నా పుస్తకాలను చదవండి. ఇప్పుడు మిమ్మల్ని కలుసుకునేంత ఆరోగ్యవంతముగా నేను ఉన్నాను. (వారి ఆరోగ్యం మెరుగుపడింది, ఇప్పుడు ఆయనను కలుసుకోగలిగే స్థితిలో ఉన్నారు.) మీరు బటాలాకు వచ్చినచో, నేను అనారోగ్యంతో ఉన్నా, అంత తీవ్రమైన తలతిరుగుడుతో బాధపడుతున్నప్పటికీ, నిలబడి నమాజ్ కూడా చేయలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ, ఎలాంటి ఇబ్బంది ఉన్నా సరే, నేను మీ వద్దకు వస్తాను."
(మక్తూబాత్-ఏ-అహ్మద్, సంపుటి 1, లేఖ సంఖ్య 6, పేజీలు 311-312)

మరో మాటలో చెప్పాలంటే, నాకు తలనొప్పి మరియు తలతిరుగుడు ఉన్నప్పటికీ, ప్రయాణం చేయగలిగేంత శక్తి నాకు ఉంది; అందువల్ల నేను మీ వద్దకు వస్తాను.

ఆ తరువాత, మౌల్వీ ముహమ్మద్ హుసైన్ బటాల్వీ సాహిబ్‌కు రాసిన మరో లేఖలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా రాశారు:

"మీకు అభ్యంతరం లేకపోతే, ఈ భవదీయుడి అభిప్రాయం ప్రకారం, నా సోదరుడైన మౌల్వీ హకీమ్ నూరొద్దీన్ సాహిబ్‌కు మీరు రాసిన ప్రత్యుత్తరంలో కొంత కఠినత్వం ఉంది. హకీమ్ మౌల్వీ నూరొద్దీన్ సాహిబ్ మీకు రాసిన లేఖకు మీరు చాలా కఠినమైన పదాలతో సమాధానమిచ్చారు. సర్వశక్తిమంతుడైన దేవుడు ఎల్లప్పుడూ వినయాన్ని, మృదుత్వాన్ని ఇష్టపడతాడు. పండితులు తమ సోదరులతో ప్రవర్తించే తీరు అత్యున్నత స్థాయి నైతికతతో కూడి ఉండాలి. (మన ప్రవర్తన, నైతికత మంచిగా ఉండాలి.) మన విశ్వాసం కోసం రాత్రింబవళ్లు మన శక్తినంతా వెచ్చిస్తూ కృషి చేయడం వల్ల మనం సాధించాల్సిన అసలు లక్ష్యం ఏమిటి? అది ఒక్కటే, మన పరిస్థితులు, కార్యాలు, కదలికలు, విశ్రాంతి స్థితులు అన్నీ అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త యొక్క చిత్తానికి అనుగుణంగా మారాలి. "నా అభిప్రాయం ప్రకారం, మనిషి సంపాదించగల అన్ని సుగుణాలలో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు అత్యంత ప్రియమైన నైతిక గుణం వినయం, మృదుత్వం, అణకువ మరియు అహంకారానికి పూర్తిగా విరుద్ధమైన ప్రతి విధమైన ఆత్మనిగ్రహం. "నాకు గుర్తుంది ఒకసారి నేను చాలా మతవిరోధి అయిన ఒక హిందువుతో సంభాషిస్తున్నాను. అతను ఇస్లాం అనే మహోన్నతమైన మతం గురించి అవమానకరమైన పదాలను ఉపయోగించడంలో హద్దులు దాటాడు. మతపరమైన ఉత్సాహంతో, నేను ఈ ఆజ్ఞను కొంతవరకు అనుసరించాను: వఘ్‌లుజ్ అలైహిం అనగా, 'వారిపట్ల కఠినంగా ఉండండి.' అయితే ఆ కఠినత్వం ఒక నిర్దిష్ట వ్యక్తి పట్ల చూపబడినందున, నాకు ఒక దైవిక సందేశం వచ్చింది: 'నీ మాట చాలా కఠినంగా ఉంది. మృదుత్వం అవసరం, మృదుత్వం.' "నేను అతనికి సమాధానం ఇచ్చినప్పటికీ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నన్ను మృదుత్వాన్ని అవలంబించమని ఆదేశించాడు. మనం న్యాయంగా ఆలోచిస్తే, మనం ఎవరం? మన జ్ఞానం ఎంత? ఒక పిచ్చుక సముద్రంలో తన ముక్కును ముంచి కొద్దిగా నీరు తీసుకుంటే, సముద్రంలో ఎంత తగ్గుదల వస్తుంది? (ఒక పక్షి సముద్రం నుంచి నీరు తాగి, తన ముక్కుతో నీటిని తాకితే, దాని వల్ల సముద్రానికి ఏమాత్రం తేడా వస్తుంది?) అదే విధంగా, వాస్తవానికి మనం వినయపూర్వకులమే కాబట్టి, మనకు మనం ధూళిలా ఉండటం మరింత శ్రేయస్కరం.

"మన యజమాని మనలో అహంకారాన్ని, గర్వాన్ని ఆమోదించనప్పుడు, మనం వాటిని ఎందుకు స్వీకరించాలి? మనకు అల్లాహ్ అసంతృప్తికి కారణమయ్యే గౌరవం కంటే, అవమానం కలగడం మేలే." అంటే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను అసంతృప్తిపరచడం కంటే, మనం అవమానాన్ని భరిస్తూ ఉండటమే మంచిది.
(మక్తూబాత్-ఏ-అహ్మద్, సంపుటి 1, లేఖ సంఖ్య 8, పేజీలు 315-316)

అందువల్ల, హుజూర్ (అ) పలికిన ప్రతి మాటలో, చేసిన ప్రతి కార్యంలో వినయం స్పష్టంగా వ్యక్తమయ్యేది. వారికి ఒకే ఒక లక్ష్యం ఉండేది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసన్నతను పొందడం, ఆయన సందేశాన్ని ప్రపంచానికి చేరవేయడం, మరియు ఆయన ఏకత్వాన్ని స్థాపించడం.

మళ్లీ మళ్లీ ఆయన మనకు ఇదే బోధ చేశారు. వినయాన్ని అలవర్చుకోండి అందులోనే మీ శ్రేయస్సు ఉంది. అంతేకాక, ఈ గుణమే మిమ్మల్ని సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు మరింత దగ్గర చేస్తుంది.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు వినయ మార్గాలను అవలంబించే సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!. ఆమీన్.

**ప్రపంచ అహ్మదీయ్యా జమాఅత్ సభ్యులకు ఒక ముఖ్య ప్రకటన:**

మన ప్రియతమ ఖలీఫా, అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి శుభప్రదమైన సూచన మేరకు తమను తాము ఆధ్యాత్మికపరమైన పటిష్టమైన కోటలో చేర్చుకొనుటకు ఈ రోజు మీరు ఈ క్రింది దుఆలను పఠించారా?.

(1) سُبْحَانَ اللهِ وَبِحَمْدِهٖ سُبْحَانَ اللهِ الْعَظِيْمِ اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّاٰلِ مُحَمَّدٍ

సుబ్‌హానల్లాహి వబిహమ్‌దిహీ సుబ్‌హానల్లాహిల్ అజీమ్ అల్లాహుమ్మ సల్లెఅలా ముహమ్మదిన్ వ్వ అలే ముహమ్మద్. (200 సార్లు పఠించవలెను)

(2) اَسْتَغْفِرُ اللهَ رَبِّيْ مِنْ كُلِّ ذَنْبٍ وَّاَتُوْبُ اِلَيْهِ

అస్తఘ్‌ఫిరుల్లాహ రబ్బి మిన్‌కుల్లి జన్‌బిన్ వ్వఅతూబు ఇలైహి.
**100 సార్లు పఠించవలెను.**

(3) رَبِّ كُلُّ شَيْءٍ خَادِمُكَ رَبِّ فَاحْفَظْنِيْ وَانْصُرْنِيْ وَارْحَمْنِيْ

రబ్బికుల్లి షైయిన్ ఖాదిముక రబ్బి ఫాహ్‌ఫజ్‌నీ వన్‌సుర్‌నీ వర్‌హమ్‌నీ.
**100 సార్లు పఠించవలెను.**

(25 సం॥ పైబడిన వారు పైన పేర్కొనబడినట్లుగా పఠించవలెను. 15 నుండి 25 సం॥ల వారు 100సార్లు, 15సం॥ల కంటే తక్కువ వయస్సు గలవారు 33 సార్లు, చిన్న పిల్లల తరుపున వారి తల్లిదండ్రులు 3నుండి 4 సార్లు పఠిస్తూ, పిల్లలతో కూడ పఠింపజేయవలెను.)

## సీరత్ ఖాతమున్నబియ్యీన్ (సల్లల్లాహు అలైహి వసల్లం):-

**రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).**

(గత సంచిక తరువాత )

తన పైవస్త్రాన్ని (చాదర్‌ను) నేలపై పరచి, దానిపై హజ్ర్-ఎ-అస్వద్‌ను ఉంచారు. తరువాత ఖురైష్‌కు చెందిన ప్రతి ప్రధాన తెగ నాయకుడిని ఆ వస్త్రం యొక్క ఒక్కో మూల పట్టమని చెప్పారు. అందరూ కలిసి ఆ వస్త్రాన్ని ఎత్తుకొని, రాయిని దాని స్థానానికి తీసుకెళ్లారు. ఈ విధంగా ఎవరికీ ఎలాంటి అభ్యంతరం లేదా అసంతృప్తి మిగలలేదు. ఈ సంఘటన అల్లాహ్ తరఫున ఒక ప్రతీకాత్మక సంకేతంగా భావించబడింది. పరస్పరం విభేదాలు, యుద్ధాలతో ఉన్న అరబ్ తెగలు, ఈ పవిత్ర వ్యక్తిత్వం ద్వారా ఒకే కేంద్రం చుట్టూ ఏకమవుతారనే సూచనగా దీనిని భావించారు.హజ్ర్-ఎ-అస్వద్‌ను అమర్చాల్సిన ఖచ్చితమైన స్థానానికి చేరుకున్న తరువాత, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన పవిత్ర హస్తాలతో ఆ రాయిని వస్త్రంపై నుంచి తీసుకుని దాని అసలు స్థానంలో అమర్చారు. ముందుగా చెప్పినట్లుగానే, ఇది కూడా ఒక ప్రతీకాత్మక సూచనగా భావించబడింది. త్వరలో ప్రవక్తుత్వ భవనంలోని "మూల రాయి" వారి ద్వారానే తన సరైన స్థానంలో స్థాపించబడుతుందనే భావాన్ని ఇది వ్యక్తం చేసింది.

సాధారణంగా చరిత్రకారులు కాబా ఈ పునర్నిర్మాణానికి సంబంధించిన తేదీ గురించి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి వయస్సు ముప్పై ఐదు సంవత్సరాలు ఉన్నప్పుడు ఈ సంఘటన జరిగిందని మాత్రమే పేర్కొంటారు. అయితే ఆ కాలంలోని పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పరిశీలిస్తే, కొత్త భవన నిర్మాణం కోసం సామగ్రిని సేకరించడం, పాత భవనాన్ని కూల్చడం వంటి పనులకు గణనీయమైన సమయం అవసరమయ్యేది. అందువల్ల ఈ పనికి సంబంధించిన సన్నాహాలు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ప్రారంభ జీవితంలోనే మొదలై ఉండవచ్చని భావించడం సమంజసం. కొత్త నిర్మాణం కోసం రాళ్లు, కలప మొదలైన సామగ్రిని క్రమంగా సేకరించడం ప్రారంభించబడింది. ఈ సందర్భంలో ఒక విశ్వసనీయ హదీస్‌లో ఇలా గలదు. ఒకసారి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాబా నిర్మాణం కోసం రాళ్లను మోస్తూ, వాటిని ఒకచోట చేర్చుతున్నారు. అప్పుడు వారి పినతండ్రి అబ్బాస్ (రజియల్లాహు అన్హు) ఇలా అన్నారు: "ఓ నా సోదరుడి కుమారుడా! రాళ్ల రాపిడితో భుజానికి గాయాలు కాకుండా ఉండేందుకు నీ నడుము వస్త్రాన్ని భుజంపై వేసుకో." ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి మాటను పాటించారు. అయితే అలా చేయడం వల్ల వారి శరీరంలోని సతర్ (కప్పి ఉంచవలసిన భాగం)లో కొంత భాగం బయటపడింది. వెంటనే సిగ్గుతో వారు నేలపై పడిపోయారు. వారి కళ్లు స్థిరంగా మారిపోయాయి. తీవ్ర ఆందోళనతో "నా నడుము వస్త్రం! నా నడుము వస్త్రం!" అని పదేపదే పలికారు. అనంతరం వెంటనే తమ నడుము వస్త్రాన్ని సరిచేసుకున్నారు. ఈ సంఘటన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి బాల్య లేదా ప్రారంభ యౌవన దశలోనే జరిగినది అని భావించవచ్చు. కొంతమంది ప్రాచీన చరిత్రకారులు కూడా ఇది వారి బాల్యకాలానికి చెందిన సంఘటన అని పేర్కొన్నారు. అయితే హజరే అస్వద్ (నల్ల రాయి)ను దాని స్థానంలో ఎవరు అమర్చాలనే వివాదంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) న్యాయనిర్ణేతగా వ్యవహరించిన సంఘటన మాత్రం తరువాత కాలంలో జరిగింది. ఎందుకంటే ఆ సందర్భంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అక్కడికి వస్తున్నారని చూసిన ప్రజలందరూ "అల్-అమీన్! అల్-అమీన్!" (అంటే, విశ్వసనీయుడు) అని పిలిచారు. వారి నిజాయితీ, విశ్వసనీయత ప్రజలందరికీ స్పష్టంగా తెలిసి, అందరూ అంగీకరించిన తరువాతే వారికి "అల్-అమీన్" అనే బిరుదు లభించింది.

### జైద్ బిన్ హారిసా (రజియల్లాహు అన్హు) దైవ ప్రవక్త సేవలోకి రావడం:-

హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హా) గారి మేనల్లుడి పేరు హకీమ్ బిన్ హిజామ్. ఆయన ఒక సంపన్న వ్యాపారి. వ్యాపార బృందాలతో తరచుగా ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ప్రయాణిస్తూ ఉండేవారు. ఒకసారి ఆయన వ్యాపార ప్రయాణం చేసి తిరిగి వచ్చినప్పుడు, కొంతమంది బానిసలను వెంట తీసుకొచ్చారు. వారిలో జైద్ బిన్ హారిసా అనే ఒక బాలుడిని తన అత్తగారైన హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హా) గారికి బహుమతిగా ఇచ్చారు. జైద్ నిజానికి స్వతంత్రులైన, గౌరవనీయమైన కుటుంబానికి చెందినవాడు. అయితే ఒక దాడి సమయంలో అతడు పట్టుబడి బానిసగా మార్చబడ్డాడు. హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హా) జైద్ తెలివైన వాడని, మంచి భవిష్యత్తు ఉన్న బాలుడని గుర్తించి, అతడిని దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి సంరక్షణకు అప్పగించారు. దైవ ప్రవక్త (స) తన బానిసలను మరియు సేవకులను ఎల్లప్పుడూ ఎంతో ప్రేమతో, దయతో చూసేవారు. వారిని తన స్వంత కుటుంబ సభ్యుల వలెనే పరిగణించేవారు. అందువల్ల జైద్ పట్ల కూడా ప్రవక్త (స)కు ఎంతగానో ప్రేమాభిమానాలు ఏర్పడ్డాయి. జైద్ కూడా ఎంతో విశ్వాసపాత్రుడు, అంకితభావం కలిగిన వ్యక్తి కావడంతో, దైవ ప్రవక్త (స) పట్ల గాఢమైన అనుబంధాన్ని పెంచుకున్నాడు. ఆ సమయంలో జైద్ తండ్రి హారిసా మరియు అతని మేనమామ కఅబ్, జైద్ కోసం అన్ని చోట్ల వెతుకుతూ మక్కాకు వచ్చారు. వారు దైవ ప్రవక్త (స) సమక్షంలో హాజరై, జైద్‌ను విడుదల చేసి తమతో పంపించమని వినయంగా అభ్యర్థించారు. దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "అవును. జైద్ మీతో వెళ్లాలని కోరుకుంటే, నా వైపు నుండి అతనికి వెళ్లేందుకు పూర్తిగా అనుమతి ఉంది." అప్పుడు జైద్‌ను పిలిపించారు. దైవ ప్రవక్త (స) అతనితో ఇలా అన్నారు: "జైద్, ఈ వ్యక్తులను నీవు గుర్తుపట్టావా? వీరు ఎవరో నీకు తెలుసా?" జైద్ సమాధానమిచ్చాడు: "అవును. ఇతను నా తండ్రి, ఇతను నా మేనమామ." దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "వారు నిన్ను తమతో తీసుకెళ్లడానికి వచ్చారు. నీవు వెళ్లాలని కోరుకుంటే, నా నుండి నీకు పూర్తి అనుమతి ఉంది." జైద్ ఇలా సమాధానమిచ్చాడు: "నేను మిమ్మల్ని ఎప్పటికీ విడిచిపెట్టను. మీరు నాకు నా మేనమామ మరియు నా తండ్రి కంటే కూడా ప్రియమైనవారు."జైద్ తండ్రికి కోపం వచ్చి ఇలా అన్నాడు: "ఏమిటి! స్వేచ్ఛ కంటే బానిసత్వాన్నే నీవు ఇష్టపడుతున్నావా?" జైద్ సమాధానమిచ్చాడు: "అవును. ఎందుకంటే వారిలో నేను అలాంటి గొప్ప గుణాలను చూశాను; ఇక వారికి బదులుగా మరెవరినీ ఎంచుకోవడం నాకు సాధ్యం కాదు." జైద్ నుండి ఈ సమాధానం విన్న వెంటనే దైవ ప్రవక్త (స) నిలబడి, జైద్‌ను తనతో తీసుకుని కాబా వద్దకు వెళ్లారు. అక్కడ ప్రవక్త (స) గట్టిగా ఇలా ప్రకటించారు: "ప్రజలారా! ఈ రోజు నుండి జైద్ స్వతంత్రుడని, అతడు నా కుమారుడని మీరు సాక్ష్యంగా ఉండండి. అతడు నా నుండి వారసత్వం పొందుతాడు, నేను అతని నుండి వారసత్వం పొందుతాను." జైద్ తండ్రి మరియు మేనమామ ఈ విషయాన్ని ప్రత్యక్షంగా చూసి ఆశ్చర్య పోయారు. వారు సంతోషంగా జైద్‌ను దైవ ప్రవక్త (స) వద్దే వదిలి తమ ఇంటికి తిరిగి వెళ్లారు. ఆ రోజు నుండి జైద్‌ను జైద్ బిన్ హారిసా అని కాకుండా జైద్ బిన్ ముహమ్మద్ అని పిలవడం ప్రారంభమైంది. అయితే హిజ్రత్ తరువాత, ఎవరినైనా చట్టపరమైన కుమారుడిగా దత్తత తీసుకోవడం అనుమతించబడదని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆజ్ఞను అవతరింపజేసినప్పుడు, జైద్‌ను మళ్లీ జైద్ బిన్ హారిసా అని పిలిచారు. అయినప్పటికీ, దైవ ప్రవక్త (స) ఈ అంకితభావం కలిగిన సేవకుడిపై చూపిన ప్రేమ, దయ ఏమాత్రం తగ్గలేదు. నిజానికి, అది రోజురోజుకూ మరింత పెరిగింది. జైద్ మరణించిన తరువాత కూడా, దైవ ప్రవక్త (స) జైద్ కుమారుడైన ఉసామా బిన్ జైద్ పట్ల అదే ప్రేమాభిమానాలను చూపించారు. ఉసామా దైవ ప్రవక్త (స) గారి సేవకురాలైన ఉమ్మె అయ్మన్‌కు జన్మించిన కుమారుడు. జైద్‌కు ఉన్న ప్రత్యేకమైన గౌరవాలలో ఒకటి ఏమిటంటే, అందరు సహాబాలలో, పవిత్ర ఖుర్ఆన్‌లో పేరు స్పష్టంగా ప్రస్తావించబడిన ఏకైక సహాబీ జైద్ బిన్ హారిసా (రజియల్లాహు అన్హు).

### అలీ ఇబ్న్ అబీ తాలిబ్ ..... దైవ ప్రవక్త (స) గారి కుటుంబంలోకి రావడం:-

అబూ తాలిబ్ ఎంతో గౌరవనీయమైన వ్యక్తి. అయితే ఆయన పేదవారు, ఎంతో కష్టమైన పరిస్థితుల్లో జీవించేవారు. ముఖ్యంగా మక్కాలో కరువు ఏర్పడిన రోజుల్లో ఆయన పరిస్థితులు మరింత దుర్భరంగా మారాయి. తన పిన్నాన్న ఎదుర్కొంటున్న కష్టాలను దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గమనించినప్పుడు, ఒకరోజు తన మరో పిన్నాన్న అబ్బాస్‌తో ఇలా అన్నారు: "పిన్నాన్నా! మీ సోదరుడు అబూ తాలిబ్ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మీరు ఆయన కుమారుల్లో ఒకరిని మీ ఇంటికి తీసుకెళ్లినచో, నేను మరొకరిని నా ఇంటికి తీసుకెళ్ళినచో ఎంత మంచిదో కదా!."

అబ్బాస్ ఈ ప్రతిపాదనకు అంగీకరించారు. ఆ తరువాత వారిద్దరూ కలిసి అబూ తాలిబ్ వద్దకు వెళ్లి తమ అభ్యర్థనను తెలియజేశారు. అబూ తాలిబ్‌కు తన కుమారుడు అఖీల్ అంటే ఎంతో ప్రేమ. ఆయన ఇలా అన్నారు: "అఖీల్ మాత్రం నా దగ్గరే ఉండనివ్వండి. మీరు కోరుకుంటే మిగిలిన వారిలో ఎవరినైనా తీసుకెళ్లవచ్చు." దాంతో అబ్బాస్ జఫార్‌ను తన ఇంటికి తీసుకెళ్లారు. దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారు అలీ (రజియల్లాహు అన్హు)ను తన సంరక్షణలోకి తీసుకున్నారు. ఆ సమయంలో అలీ (రజియల్లాహు అన్హు) వయస్సు సుమారు ఆరు లేదా ఏడు సంవత్సరాలు. అప్పటి నుంచి అలీ (రజి) దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతోనే ఉన్నారు.

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**
**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**
**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

**సీరతుల్ మహ్దీ**
**(అలైహిస్సలాతు వస్సలాం):-**
**రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).**

**(30) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం:** ఈ భవదీయుడు తెల్పునదేమనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి అలవాటు ఏమిటనగా, ప్రతి వ్యక్తి చెప్పే స్వప్నాన్ని ఎంతో శ్రద్ధగా వినేవారు. అనేక సందర్భాల్లో వాటిని లిఖించుకొని కూడా ఉంచేవారు. ఒకసారి మిర్జా కమాలుద్దీన్ మరియు వారి సహచరులు మసీదు కిందుగా వెళ్లే మార్గాన్ని గోడ కట్టి మూసివేశారు. దాంతో అహ్మదీయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఆ పరిస్థితిలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి చట్టపరమైన చర్యలు తీసుకోవడం తప్పనిసరి అయింది. (ఈ ఒక్క సందర్భాన్ని మినహాయిస్తే, హుజూర్ (అ) తనంతట తానే ఎవరిపైనా కేసు వేయలేదు.) ఆ సమయంలో నేను ఒక కల చూశాను. ఆ గోడను కూల్చివేస్తున్నారు; నేను కూలిపోయిన గోడపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాను. ఆ కలను నేను హజ్రత్ సాహిబ్ గారికి చెప్పాను. హుజూర్ (అ) ఎంతో శ్రద్ధగా విని, దానిని రాసి పెట్టుకున్నారు. ఆ సమయంలో నేను చిన్న బాలుడిని.

**(31) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం:** ఈ భవదీయుడు తెల్పునదేమనగా, 1905లో సంభవించిన మహా భూకంపం రోజులలో హజ్రత్ సాహిబ్ తోటలో నివాసం ఏర్పరచుకున్నారు. ఆ రోజుల్లో ముఫ్తీ ముహమ్మద్ సాదిక్ సాహిబ్ గారి కుమారుడు ముహమ్మద్ మన్జూర్ (అప్పుడు అతను చిన్న బాలుడు) ఒక కల చూశాడు. ఆ కలలో అనేక మేకలను బలి ఇస్తున్నట్లు కనిపించింది. ఈ విషయం హజ్రత్ సాహిబ్ గారికి తెలియగానే, హుజూర్ (అ) కొన్ని మేకలను కొనిపించి సదఖా (దానంగా బలి) చేయించారు. హుజూర్ (అ)ను అనుసరించి మరెందరో కూడా అలాగే చేశారు. నా అంచనా ప్రకారం, ఆ సమయంలో తోటలో వందకు పైగా మేకలను సదఖాగా బలి ఇచ్చి ఉండవచ్చు.

**(32) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం:** ఈ భవదీయుడు తెల్పునదేమనగా, 1905లో భూకంపం సంభవించినప్పుడు నేను చిన్న బాలుడిని. మేము ఇతర పిల్లలతో కలిసి నగరవాసులైన నవాబ్ ముహమ్మద్ అలీ ఖాన్ గారి ఇంటికి ఆనుకుని ఉన్న హజ్రత్ సాహిబ్ ఇంటి భాగంలో మంచాలపై నిద్రిస్తున్నాము. అకస్మాత్తుగా భూకంపం రావడంతో మేమంతా భయంతో ఒక్కసారిగా మేల్కొన్నాము. ఏమి జరుగుతోందో మాకు అర్థం కాలేదు. ఇంటి ప్రాంగణంలోకి పరుగెత్తి వచ్చేసరికి పై నుంచి చిన్న రాళ్లు, గులకరాళ్లు పడుతున్నాయి. మేము పరుగెత్తుకుంటూ పెద్ద ఇంటి వైపు వెళ్లాము. అక్కడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు మరియు మా తల్లిగారు గది నుంచి బయటకు వస్తున్నారు. వెంటనే మేమంతా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారిని పట్టుకుని వారిని గట్టిగా కౌగిలించుకున్నాము. ఆ సమయంలో వారు కూడా ఆందోళనలో ఉండి పెద్ద ప్రాంగణం వైపు వెళ్లాలని అనుకుంటున్నారు. కానీ చుట్టూ పిల్లలంతా వారిని పట్టుకుని ఉండగా, మా తల్లిగారు కూడా వారితోనే ఉన్నారు. ఎవరో ఒకరు ఈ వైపు లాగుతున్నారు, మరొకరు ఆ వైపు లాగుతున్నారు. చివరకు ఎంతో కష్టపడి వారు, అలాగే వారిని పట్టుకుని ఉన్న మేమంతా పెద్ద ప్రాంగణానికి చేరుకున్నాము. అప్పటికే భూకంపం తీవ్రత కూడా తగ్గిపోయింది. కొద్దిసేపటి తరువాత హుజూర్ (అ) మమ్మల్ని తమ తోటకు తీసుకెళ్లారు. ఇతర మిత్రులు కూడా తమ సామాను తీసుకుని అక్కడికి చేరుకున్నారు. అవసరానికి అనుగుణంగా అక్కడ కొన్ని మట్టి ఇళ్లు నిర్మించబడ్డాయి, మరికొన్ని గుడారాలు కూడా తెప్పించారు. అనంతరం మేమంతా చాలా కాలం ఆ తోటలోనే నివసించాము. ఆ రోజుల్లో పాఠశాల కూడా అక్కడే నిర్వహించబడేది. అలా చూస్తే, ఆ తోటలోనే ఒక చిన్న పట్టణం ఏర్పడినట్లైంది. అల్లాహ్! అల్లాహ్! ఎంత అద్భుతమైన కాలమో!.

**(33) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం:** ఖాజీ అమీర్ హుసైన్ సాహిబ్ ఇలా వివరించారు: "మొదట్లో నేను ప్రయాణ సమయంలో ఖసర్ (నమాజును సంక్షిప్తంగా చేయడం) సాధారణ పరిస్థితుల్లో అనుమతించబడినది కాదని, అది కేవలం యుద్ధ పరిస్థితుల్లో లేదా ప్రమాదం భయం ఉన్నప్పుడు మాత్రమే అనుమతించబడినది అని నమ్మేవాడిని. ఈ విషయంపై మౌల్వీ సాహిబ్ (హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్) గారితో తరచూ చర్చించేవాడిని. ఖాజీ సాహిబ్ మరల ఇలా చెప్పారు: "హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారి గురదాస్‌పూర్‌లో ఒక కేసు నడుస్తున్న రోజుల్లో ఒకసారి నేను కూడా అక్కడికి వెళ్లాను. హజ్రత్ సాహిబ్‌తో పాటు మౌల్వీ సాహిబ్ (హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్) మరియు మౌల్వీ అబ్దుల్ కరీమ్ సాహిబ్ కూడా ఉన్నారు. జొహర్ నమాజ్ సమయం రాగానే హజ్రత్ సాహిబ్ నాతో, 'ఖాజీ సాహిబ్, మీరు నమాజ్ చదివించండి' అని అన్నారు. నేను మనసులో గట్టిగా నిర్ణయించుకున్నాను: 'ఈ రోజు నాకు అవకాశం వచ్చింది. నేను ఖసర్ చేయను. పూర్తిగా నాలుగు రకాత్‌లు చదువుతాను. అప్పుడు ఈ విషయంపై ఒక నిర్ణయం వస్తుంది.' ఈ సంకల్పంతో నేను తక్బీర్ చెప్పేందుకు చేతులు ఎత్తాను. హజ్రత్ సాహిబ్ నా వెనుక కుడివైపు నిలబడి ఉన్నారు. వెంటనే వారు (అ) ఒక అడుగు ముందుకు వచ్చి నా చెవికి దగ్గరగా నోరు పెట్టి ఇలా అన్నారు: 'ఖాజీ సాహిబ్! రెండు రకాత్‌లే చదువుతారు కదా?' అప్పుడు నేను, 'హుజూర్, రెండు రకాత్‌లే చదువుతాను' అని వినయంగా సమాధానమిచ్చాను. ఆ క్షణం నుంచే ఈ విషయంపై నా సందేహం పూర్తిగా తొలగిపోయింది. నా పూర్వ అభిప్రాయాన్ని వదిలేశాను."

**(34) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం:** ఖాజీ అమీర్ హుస్సేన్ సాహిబ్ మాతో ఇలా చెప్పారు: తన మొదటి భార్యకు పుట్టిన ఒక కుమారుడు మరణించాడు. ఆ బాలుడి తల్లి చాలా ఎక్కువగా దుఃఖిస్తూ, విలపిస్తూ ఉండేది. అలాగే ఆ బాలుడి మాతామహి (తల్లి గారి తల్లి) కూడా అదే విధంగా తీవ్రంగా విలపించేది. నేను వారిని పదేపదే ఆపడానికి ప్రయత్నించాను, కానీ వారు తమను తాము అదుపుచేసు కోలేదు. ఆ బాలుడి జనాజా నమాజ్ చదివించడానికి హజ్రత్ మసీహ్ మౌఊద్, అలైహిస్సలాం, వచ్చినప్పుడు, జనాజా నమాజ్ అనంతరం హుజూర్(అ) నిలబడి చాలా సేపు ఉపదేశం చేశారు. చివరగా హుజూర్ (అ) ఇలా అన్నారు: "ఖాజీ సాహిబ్, నా ఈ ఉపదేశాన్ని మీ ఇంటివారికి కూడా తెలియజేయండి." నేను ఇంటికి తిరిగి వచ్చి, హజ్రత్ సాహిబ్ చేసిన ఉపదేశాన్ని నా భార్యకు వివరించాను. ఆ తరువాత ఆమెకు చెందిన మరో ఇద్దరు లేదా ముగ్గురు కుమారులు కూడ మరణించారు. అయితే ఆమె కన్నీళ్లు పెట్టుకోవడం తప్ప మరే విధమైన విలాపనం గాని, ఆవేదనను గాని వ్యక్త పర్చలేదు.

**(35) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం:** మౌల్వీ షేర్ అలీ సాహిబ్ నాకు ఇలా చెప్పారు: ఒకసారి హజ్రత్ మసీహ్ మౌఊద్, అలైహిస్సలాం, ఖాదియాన్ నుండి గుర్దాస్‌పూర్‌కు ప్రయాణిస్తున్నప్పుడు బటాలాలో ఆగారు. హుజూర్ (అ)ను కలవడానికి ఖాదియాన్ నుండి బటాలాకు వెళ్లిన ఒక అతిథి, హుజూర్(అ)ను అక్కడ కలుసుకుని, కానుకగా కొన్ని పండ్లు తీసుకువచ్చాడు. ఆ పండ్లలో ద్రాక్ష పండ్లు కూడా ఉన్నాయి.
హుజూర్ (అ) ఆ ద్రాక్ష పండ్లని తిని ఇలా అన్నారు: "ద్రాక్షలో పులుపు ఉంటుంది, కానీ ఈ పులుపు జలుబుకు హానికరం కాదు." తరువాత హుజూర్ (అ) ఇలా అన్నారు: "ఇప్పుడే నా మనసులో ద్రాక్ష పండ్లుతినాలనే కోరిక కలిగింది; అందుకే అల్లాహ్ వాటిని పంపించాడు." మరల ఇలా అన్నారు: "నా మనసులో ఏదైనా వస్తువు తినాలనే లేదా పొందాలనే కోరిక కలిగినప్పుడు, అల్లాహ్ దానిని నాకు సమకూర్చిన సందర్భాలను నేను అనేకసార్లు చూశాను." తరువాత మౌల్వీ షేర్ అలా సాహెబ్ మరొక సంఘటనను వివరించారు. వారు ఇలా చెప్పారు: ఒకసారి నేను ప్రయాణిస్తున్నప్పుడు, నా మనసులో చెరుకు కర్రలను తినాలనే కోరిక కలిగింది. అయితే ఆ మార్గంలో ఎక్కడా చెరకు దొరకలేదు. కానీ అల్లాహ్ మహిమ వల్ల, కొద్దిసేపటి తరువాత మాకు ఒక వ్యక్తి ఎదురయ్యాడు. అతని వద్ద చెరకు కర్రలు ఉన్నాయి. అతని వద్ద నుండి మాకు కొన్ని చెరకు కర్రలు లభించాయి.

**(36) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం:** మా తల్లి గారు నాకు ఇలా తెలియజేశారు: ప్రారంభ దశలో ఒకసారి హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) తీవ్రమైన అనారోగ్యంనకు గురైనారు. ఎవరో మిర్జా సుల్తాన్ అహ్మద్ మరియు మిర్జా ఫజల్ అహ్మద్‌లకు కూడా సమాచారం అందించడంతో, వారిద్దరూ వచ్చారు. వారి సమక్షంలో కూడా హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) మరోసారి అట్టి అనారోగ్యంనకు గురైనారు. మా తల్లి గారు ఇలా చెప్పారు: ఆ సమయంలో నేను గమనించినది ఏమిటంటే, మిర్జా సుల్తాన్ అహ్మద్ హజ్రత్ వారి మంచం పక్కన నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నారు. అయితే మిర్జా ఫజల్ అహ్మద్ ముఖం మాత్రం ఆందోళనతో పదేపదే రంగు మారుతూ ఉండేది. ఒక క్షణం పాలిపోయినట్లు కనిపించేది, మరొక క్షణం ఆయన ముఖవర్ణం మారిపోయేది. ఆయన కొన్నిసార్లు ఇటువైపు, మరికొన్నిసార్లు అటువైపు పరుగెత్తేవారు. ఒక్కోసారి తన తలపాగాను తీసి హజ్రత్ వారి కాళ్లను దానితో కట్టేవారు. మరికొన్నిసార్లు వారి పాదాలను ఒత్తడం ప్రారంభించేవారు. తీవ్రమైన ఆందోళన మరియు కలవరంతో ఆయన చేతులు వణుకుతూ ఉండేవి.

**ఉపశాఖల వార్షిక సమావేశాలు ఖాదియాన్**

సయ్యిద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు మజ్లిస్ అన్సారుల్లాహ్, ఖుద్దాముల్ అహ్మదియ్య, అత్ఫాలుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాకా! (ఆమీన్)

EDITOR : SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
e-mail:
akhbaarbadarteluguqdn@gmail.com
www.akhbarbadr.in

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA తెలుగు వార పత్రిక

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 03 SEP 2026, Issue No : 36

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail
managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

**సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.**

# బక్రీద్ పండుగ నమాజ్ మరియు ప్రసంగం:

**(గత సంచిక తరువాత భాగం)**

హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) వారు ఇలా ప్రసంగించారు: అదేవిధంగా, నేను చెప్పినట్లుగా దాసుల హక్కులను చెల్లించడం కూడా త్యాగపు ఒక రూపమే. మనలో చాలామంది తమను తాము కష్టపెట్టుకొని ఈ హక్కులను నెరవేరుస్తారు. అయితే, ఇతరుల న్యాయబద్ధమైన హక్కులను కూడా హరించేవారు ఉన్నారు. అలాంటి వారు ఎన్ని త్యాగాలు చేసినా, ఎన్ని నమాజ్‌లు చదివినా, అల్లాహ్ తఆలా " మీ త్యాగాలు, మీ ఆరాధనలు ఎంత విలువైనవి అయినా కూడ నాకు పట్టింపు లేదు" అని పేర్కొన్నాడు. అయితే, ఏదో ఒక రూపంలో పేదలకు సేవ చేయడం, హక్కులను నెరవేర్చడం, సోదరులతో మంచిగా ప్రవర్తించడం, ఒకరినొకరు క్షమించే అలవాటు కలిగి ఉండడం, ఇవన్నీ అల్లాహ్ తఆలా ప్రసన్నత కోసం జరుగుతున్నట్లయితే, ఆ హక్కులను నెరవేర్చడం కూడా ఆరాధనగా మారుతుంది. అల్లాహ్ తఆలా వద్ద అంగీకారాన్ని పొంది, మనిషిని అల్లాహ్ తఆలా సాన్నిత్యానికి చేర్చే సాధనంగా నిలుస్తుంది.

హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) వారు ఇలా ప్రసంగించారు: కాబట్టి, అల్లాహ్ తఆలా అన్ని అవసరాల నుండి పూర్తిగా అతీతుడని మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. ఆయన తినడు, త్రాగడు. ఆయనకు ఏ మాంసమూ అవసరం లేదు. లక్షలాది జంతువుల రక్తాన్ని చిందించాల్సిన అవసరం కూడా ఆయనకు లేదు. దాని వల్ల ఆయనకు ఎలాంటి ప్రయోజనం కలగదు. అలాగే, అల్లాహ్ తఆలా పేరుతో రక్తం చిందించడం వల్ల ఏ మనిషికీ ప్రయోజనం కలగదు. తన సేవకులపై ఉపకారం చేస్తూ, శాశ్వతమైన బహుమతులకు వారసులుగా మారడానికి, తమ పండుగలను శాశ్వతమైనవిగా చేసుకోవడానికి, తమ సృష్టి యొక్క అసలు ఉద్దేశ్యాన్ని గుర్తించే భావనను పెంపొందించుకొని, దాసుల హక్కులను నెరవేర్చడం వైపు దృష్టి పెట్టాలని ఆయన బోధించాడు. అందుకే కొన్ని బాహ్యమైన త్యాగాలను కూడా నిర్ణయించాడు. ఖుర్‌ఆన్ షరీఫ్‌లో వివరించబడిన ఆజ్ఞ ప్రకారం, మీ మెడలను అల్లాహ్ తఆలా ముందు వంచండి. మీ క్రియలను అల్లాహ్ తఆలా ప్రసన్నతను పొందడానికి సాధనంగా చేసుకోండి.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాతు వస్సలాం) వారు ఇలా తెలిపారు: "ప్రకృతి నియమం ప్రాచీన కాలం నుండి ఇలాగే ఉంది. ఇవన్నీ సంపూర్ణ పరిజ్ఞానం (మారిఫత్) పొందిన తరువాతే లభిస్తాయి. భయం, ప్రేమ మరియు కృతజ్ఞతలకు మూలం సంపూర్ణ పరిజ్ఞానమే. కాబట్టి ఎవరికైతే సంపూర్ణ పరిజ్ఞానం ప్రసాదించబడిందో, అతనికి భయం మరియు ప్రేమ కూడా సంపూర్ణంగా ప్రసాదించ బడతాయి. ఎవరికైతే భయం మరియు ప్రేమ సంపూర్ణంగా ప్రసాదించబడతాయో, అతనికి నిర్భయంగా, విచక్షణ లేకుండా చేసే ప్రతి పాపం నుండి విముక్తి ప్రసాదించ బడుతుంది."

హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) వారు ఇలా ప్రసంగించారు: కాబట్టి, ఈ మారిఫత్ (దైవ పరిజ్ఞానం) పొందడానికి ప్రయత్నించండి. దీని ద్వారానే అల్లాహ్ తఆలా పట్ల భయం కూడా కలుగుతుంది, ప్రేమ కూడా కలుగుతుంది. ఎందుకంటే ఇవే మనిషిని నిర్భయంగా పాపాలకు పాల్పడకుండా కాపాడే విషయాలు. మనిషి ఎన్నో పాపాలు చేస్తుంటాడు. ఆలోచించ కుండానే వాటిని చేస్తూ ఉంటాడు. తన హృదయంలో, "అల్లాహ్ తఆలా ప్రతి క్షణం నన్ను చూస్తున్నాడు" అనే భావన ఉండదు.

మరల వారు ఇలా తెలిపారు: "కాబట్టి, ఈ మోక్షం కోసం మనకు ఎటువంటి రక్తమూ చిందించవలసిన అవసరం లేదు. ఎటువంటి సిలువను కూడా మోయవలసిన అవసరం లేదు. ప్రాయశ్చిత్తం కూడా అవసరం లేదు. కేవలం మనకు అవసరమైనది ఒక్కటే బలి. అది మన స్వయాన్నే అర్పించుకునే బలి. ఈ అవసరాన్ని మన స్వభావమే మనలో అనుభూతి చెందుతుంది. మరో మాటలో చెప్పాలంటే, అటువంటి బలినే ఇస్లాం అని పిలుస్తారు. ఇస్లాం అనే పదానికి 'వధించబడటానికి తన మెడను ముందుకు ఉంచడం' అనే అర్థం ఉంది. అంటే, సంపూర్ణ సుముఖతతో మరియు విధేయతతో తన ప్రాణాన్ని అల్లాహ్ సన్నిధిలో అర్పించడం. ఈ అందమైన నామమే షరీఅత్ యొక్క స్ఫూర్తి మరియు దాని అన్ని ఆజ్ఞల సారాంశం. స్వచ్ఛందంగా, సంతోషంగా తన మెడను బలికి ముందుకు ఉంచాలంటే పరిపూర్ణమైన ప్రేమ మరియు పరిపూర్ణమైన భక్తి అవసరం. పరిపూర్ణమైన ప్రేమకు పరిపూర్ణమైన ఆధ్యాత్మిక జ్ఞానం అవసరం. అందువల్ల, 'ఇస్లాం' అనే పదమే నిజమైన బలికి అల్లాహ్ గురించి పరిపూర్ణమైన జ్ఞానం, పరిపూర్ణమైన ప్రేమ తప్ప మరేదీ అవసరం లేదని సూచిస్తుంది. మహోన్నతుడైన అల్లాహ్ పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇదే విషయాన్ని ఇలా తెలియజేస్తున్నాడు: **లన్ య్యనాలల్లాహ లుహూముహా వలా దిమావూహా వలాకిన్ యనాలుహుత్తఖ్వా మిన్‌కుమ్** అనగా 'వాటి మాంసమూ, వాటి రక్తమూ అల్లాహ్‌ను చేరవు; కానీ మీ భక్తి, నీతి ఆయనను చేరుతుంది.' మరో మాటలో చెప్పాలంటే, మీరు చేసే బలుల మాంసం నా వద్దకు చేరదు, వాటి రక్తం కూడా చేరదు; బదులుగా, నా వద్దకు చేరేది మీ నీతికి సంబంధించిన బలి. మీరు నాకు భయపడటం, నా కోసం తక్వాను (దైవభక్తిని) స్వీకరించడం."

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు తెల్పినట్లుగా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి అనుచరులు ఈ దైవభీతిని తమలో కల్పించుకున్నారు. అందువలనే వారు "మేము ఆలకించాము, మేము అనుసరించాము" కు సంపూర్ణ ఆదర్శవంతులుగా నిలిచారు. పరిపూర్ణమైన ధార్మిక పరిజ్ఞానం వారికి లభించింది. అందువలనే వారు పరిపూర్ణమైన ప్రేమ మరియు భక్తికి ఉదాహరణలను చూపించారు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తపై వారికి ఉన్న పరిపూర్ణమైన ప్రేమ కారణంగా, మద్యం వల్ల కలిగే మత్తు ప్రభావాల పట్ల తమకున్న అనుబంధాన్ని కూడా వారు అధిగమించ గలిగారు. ఆ ప్రేమ మద్యం పట్ల వారి ఆకర్షణను జయించింది. మొదట వారు దానిని ఉంచిన పాత్రలను పగులగొట్టారు. ఆ తరువాత ఈ ఆజ్ఞ ప్రత్యేకంగా తమకే వర్తిస్తుందా, ఇతరులకు వర్తిస్తుందా, లేదా ఆ ఆజ్ఞ యొక్క అసలు స్వరూపం మరియు దాని ఉద్దేశ్యం ఏమిటో తెలుసుకోవడానికి ప్రయత్నించారు."

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు మరల ఇలా తెలిపారు: "కాబట్టి, ఈ స్ఫూర్తిని మనలో పెంపొందించుకోవడానికి ప్రయత్నించాలి. ఈ ఆత్మ ఒక వ్యక్తిలో అభివృద్ధి చెందినప్పుడు, అతడు అత్యున్నత స్థాయి త్యాగాన్ని సాధించడానికి మరియు అల్లాహ్ సంతోషాన్ని కోరుకునే వ్యక్తిగా మారడానికి అది సహాయపడుతుంది. ఈద్-ఉల్-అజ్‌హా యొక్క స్ఫూర్తి కూడ ఈ విషయాన్ని మరోసారి మన హృదయాల ముందుకు తీసుకువస్తుంది మరియు ఒక వ్యక్తిని అల్లాహ్‌కు ప్రియమైనవాడిగా చేస్తుంది. ఈ ఆధ్యాత్మిక స్థాయిని మనం నిరంతరం సాధించలేమని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. మనము పలికే ప్రతి మాటను, మనము చేసే ప్రతి కార్యాన్ని అల్లాహ్ గమనిస్తున్నాడనే విషయాన్ని ఎల్లప్పుడూ మన దృష్టిలో ఉంచుకోకపోతే. **(తదుపరి సంచికలో చదవగలరు)**

**131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్**

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక! (ఆమీన్) **( నజారత్ ఇస్లాహ్ ఇర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్ )**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz